నేడు
TELUGU DAILY
విలేకరులు కావలెను
అనతికాలంలోనే పత్రికారంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన నేడు తెలుగు దినపత్రికలో పనిచేయుటకు రిపోర్టర్లు కావలెను. తెలంగాణలోని 33 జిల్లాల్లో పని చేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి ఉన్నవారు. nedudailynews@gmail.comకు బయోడెటా పంపగలరు.
9346984911
9133445456

సంచలన వార్తలకు
# నేడు
TELUGU DAILY

గురువారం | 23.04.2026 | సంపుటి : 3 | సంచిక :362 | పేజీలు : 8 | వెల : 2/- | www.nedudailynews.com



లఖ్‌నవూపై రాజస్థాన్ రాయల్స్ ఘన విజయం 08

# కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై విచారణ

## జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికను నిలిపివేసిన హైకోర్టు

### నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలూ చేపట్టవద్దని ఆదేశం

**కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై విచారణ నిమిత్తం ఏర్పాటు చేసిన జస్టిస్ ఘోష్ కమిషన్‌పై దాఖలైన పిటిషన్‌లపై హైకోర్టు బుధవారం తీర్పు వెలువరించింది. ఈ వ్యవహారంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులకు ఊరట కల్పించింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎలాంటి నిబంధనలూ పాటించలేదని కోర్టు పేర్కొంది. నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలూ చేపట్టవద్దని ఆదేశించింది.**

బ్యారేజీల్లో అవకతవకలపై విచారణ నిమిత్తం జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్‌ను నియమిస్తూ 2024 మార్చి 14న జారీ చేసిన జీవో 6ను సవాలు చేస్తూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు, ఐఏఎస్ అధికారులు స్మితా సభర్వాల్, ఎస్.కె.జోషిలు వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్‌లపై ప్రధాన -మిగతా 2 లో..

## కేసీఆర్, హరీశ్‌రావుకు భారీ ఊరట



## ఎన్ని కుట్రలు పన్నినా న్యాయం గెలిచింది

### హైకోర్టు తీర్పుపై మాజీమంత్రి హరీష్ రావు

హైదరాబాద్, ఏప్రిల్ 22 :ఎవరెన్ని కుట్రలు చేసినా న్యాయస్థానాల్లో అంతిమంగా ధర్మం జయిస్తుందని, సత్యం నినదిస్తుందని ఈరోజు మరోసారి నిరూపితమైందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించి పీసీ ఘోష్ నివేదికపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా మాజీ మంత్రి -మిగతా 2 లో..



## కాళేశ్వరంపై ఎవ్వరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదు

### హైకోర్టు తీర్పుపై సిఎంతో ఉత్తమ్ చర్చలు

### తదుపరి కార్యాచరణపై ఇరు నేతల సమాలోచనలు

### సిబిఐ విచారణకు తీర్పు అడ్డం కాదన్న మంత్రి ఉత్తమ్

**కాళేశ్వరం ప్రాజెక్టులో తెలంగాణ హైకోర్టు ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. జస్టిస్ ఘోష్ కమిషన్ ఏర్పాటు సరైందని హైకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసిందని తెలిపారు. సీబీఐకి ఘోష్ కమిషన్ పంపిన రిపోర్టుల్లో ఎవరి పేర్లను మెన్షన్ చేయలేదని చెప్పకొచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డితో మంత్రి ఉత్తమ్ బుధవారం భేటీ అయ్యారు.**

హైదరాబాద్, ఏప్రిల్ 22 : ఈ సమావేశంలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్, హైకోర్ట్ తీర్పుపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మీడియాతో చిట్ చాట్ చేశారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 6ను కొట్టివేయాలని పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారని కానీ జ్యుడిషియల్ కమిషన్ ఏర్పా టును హైకోర్టు తప్పుపట్టలేదని స్పష్టం చేశారు. జస్టిస్ -మిగతా 2 లో..



07

## కాల్పుల విరమణ పొడిగించిన ట్రంప్

స్పష్టమైన ప్రతిపాదనతో రావాలని ఇరాన్‌కు సూచన

ట్రూత్ సోషల్ మీడియాలో వెల్లడించిన అధ్యక్షుడు



07

## ఇప్పట్లో చర్చలు లేనట్లే..

జేడీ వాన్స్ బృందం పాక్ పర్యటన వాయిదా..

## ఆర్థికంగా కుదేలవుతున్న ఇరాన్

రోజుకు సుమారు 500 మిలియన్ల డాలర్లు నష్టం 07



# బస్సులు డిపోలకే పరిమితం

### డిపోల ముందు ధర్నాలతో కార్మికుల నిరసన

### నగరంలో అద్దె బస్సులను తిప్పిన ప్రభుత్వం

**చాన్నాళ్లకు ఆటోలు, క్యాబ్‌లకు పెరిగిన గిరాకీ**

**కరీంనగర్‌లో లారీని ఢీకొట్టిన అద్దె బస్సు**

**నగరంలో మెట్రో సర్వీసులను పొడగించిన సర్కార్**

**కార్మికుల సమస్యలపై సానుకూలంగా ఉన్నట్లు ఎండి వెల్లడి**

హైదరాబాద్, ఏప్రిల్ 22 : చాలాలకాలం తరవాత ఆర్టీసీ బస్సులు సేదదీరుతున్నాయి. సమ్మె కారణంగా అన్ని బస్సులు ఆయా డిపోలకే పరిమితం అయ్యాయి. తెలంగాణ వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. ప్రభుత్వంతో చర్చలు విఫలం -మిగతా 2 లో..



## హైకోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు

### కాళేశ్వరం అవినీతి విచారణలో సర్కార్ విఫలం

### అవకతవకలపై ఇన్నేళ్లయినా చర్యలు లేవు

### ప్రభుత్వ వైఫల్యాన్ని బయటపెట్టిన హైకోర్టు తీర్పు

### విమర్శలు గుప్పించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 22 : కాళేశ్వరం అవినీతి విచారణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆరోపించారు. కాళేశ్వరం అవకతవకలపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికకు సంబంధించి బుధవారం తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు ఈ ప్రభుత్వ వైఫల్యాన్ని మరోసారి -మిగతా 2 లో..





## కాళేశ్వరం కథ ముగియలేదు

### సిబిఐ విచారణకు తీర్పు అడ్డంకి కాదు

### బిఆర్ఎస్ నేతల సంబరాలు ఎందుకో

### మండిపడ్డ టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్, ఏప్రిల్ 22 : కాళేశ్వరంపై తెలంగాణ హైకోర్టు క్లీన్ చిట్ ఇవ్వలేదని.. బీఆర్ఎస్ నేతలు ఎందుకు సంబరాలు చేసుకుంటున్నారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. హైకోర్టు తీర్పు సీబీఐ విచారణకు అడ్డంకి కాదన్నారు. హైకోర్టు తీర్పును పూర్తిగా అధ్యయనం చేశాక భవిష్యత్తు -మిగతా 2 లో..



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 115 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 142 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 206 (కిలో) |
| స్కిన్ లెస్ | 234 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹74



## ఒకే సూత్రాన్ని అన్ని మతాల ఆచారాలకు వర్తింపజేయడం అసాధ్యం

### వాస్తవ పరిస్థితులు, ఆచారాల నేపథ్యం కూడా ముఖ్యం

### శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశం కేసు విచారణ

### సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22 : మత స్వేచ్ఛ, సామాజిక సంస్కరణల మధ్య సమతుల్యత అనేది ఆయా కేసుల వాస్తవ పరిస్థితులు, ఆచారాల నేపథ్యంపైనే ఆధారపడి ఉంటుందని సుప్రీం ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ విచారణ కేవలం శబరిమలకే పరిమితం కాకుండా, మసీదుల్లోకి -మిగతా 2 లో..

## వాయిదాల్లో ఓటుకు నోటు కేసు విచారణ

### రెండు వారాలకు వాయిదా వేసిన సుప్రీం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22 : ఓటుకు నోటు కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. జస్టిస్ జేకే మహేశ్వరి నేతృత్వంలోని ప్రత్యేక ధర్మాసనం ఈ కేసును మరో రెండు వారాల తర్వాత విచారిస్తామని తెలిపింది. ఈ ధర్మాసనంలో జస్టిస్ -మిగతా 2 లో..జశ్రీ



## పీసీ ఘోష్ కమిషన్ కాదు.. ముమ్మాటికీ పీసీసీ నివేదిక

### రాజకీయ కుట్రలు పక్కన పెట్టి రైతన్నల కోసం పనిచేయండి

### హైకోర్టు తీర్పుపై మీడియాతో కెటిఆర్



హైదరాబాద్, ఏప్రిల్ 22 : కూలింది.. కాళేశ్వరం కాదని, కాంగ్రెస్ చేసిన కుట్రలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంశంలో జస్టిస్ పీసీ ఘోష్ ఇచ్చిన నివేదికపై బుధవారం హైకోర్టు ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ పార్టీ హర్షం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలోనే కేటీఆర్ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. హైకోర్టు తీర్పు కాంగ్రెస్ కుట్రలకు చెంపపెట్టు అని కేటీఆర్ అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ సర్కార్ రాజకీయ కుట్రలు -మిగతా 2 లో..

# కేసీఆర్, హరీశ్‌రావులకు హైకోర్టులో ఊరట

(మొదటిపేజీ తరువాయి)

న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌ల ధర్మాసనం సుదీర్ఘ విచారణ జరిపింది. నేడు తీర్పును వెలువరించింది. కేసీఆర్, హరీశ్‌రావుతోపాటు స్మితా సబర్వాల్, ఎస్.కె.జోషిలకు కూడా కోర్టు ఊరట కల్పించింది. హైదరాబాద్, ఏప్రిల్ 22 : కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించి మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావుకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను ధర్మాసనం నిలిపివేసింది. జస్టిస్ ఘోష్ కమిషన్ చట్టబద్ధమేనని న్యాయస్థానం తెలిపింది. అయితే రిపోర్ట్ ఆధారంగా చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో పిటిషనర్లు కేసీఆర్, హరీశ్ రావుతో పాటు స్మిత సబర్వాల్, ఎస్‌కే జోషికి ఊరట లభించినట్లైంది. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అవినీతి జరిగిందంటూ రాష్ట్ర ప్రభుత్వం 2024 మార్చిలో జీవో నంబర్ 6ను జారీ చేస్తూ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను నియమించింది. అయితే ఘోష్ కమిషన్‌ను సవాల్ చేస్తూ తెలంగాణ హైకోర్టులో మాజీ సీఎం కేసీఆర్, హరీశ్




రావు, స్మిత సబర్వాల్, ఎస్‌కే జోషి పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై న్యాయస్థానంలో సుదీర్ఘంగా విచారణ జరిగింది. ఈ పిటిషన్లపై ఏప్రిల్ 8న వాదనలు ముగియగా తీర్పును హైకోర్టు ఈరోజుకు(ఏప్రిల్ 22) వాయిదా వేసింది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 6ను సమర్థించిన హైకోర్టు.. జీవో నంబర్ 6ను ఆధారంగా ఏర్పాటైన కమిషన్ నివేదికను అసెంబ్లీలో చర్చ జరగకుండానే మీడియా ముందుకు తీసుకురావడాన్ని న్యాయస్థానం తప్పుబట్టింది. కమిషన్ ఇచ్చిన నివేదికను ఆధారంగా చేసుకుని పిటిషనర్లపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని తెలంగాణ హైకోర్టు తీర్పునిచ్చింది. కాళేశ్వరంపై హైకోర్టు తీర్పుతో కేసీఆర్‌కు ఊరట లభించిందని మాజీ సీఎం అడ్వకేట్ గండ్రమోహన్ రావు తెలిపారు. హైకోర్టు తీర్పుతో కమిషన్ రిపోర్టును చెత్తలో పడేయవచ్చన్నారు. సెక్షన్ 8 కింద విచారణ జరగలేదని చెప్పారు. పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటును హైకోర్టు సమర్థించిందని తెలిపారు. అయితే కమిషన్ రిపోర్టును పరిగణనలోకి తీసుకుని సీబీఐ దర్యాప్తు చేయరాదని న్యాయస్థానం చెప్పిందని కేసీఆర్ అడ్వకేట్ గండ్రమోహన్ రావు వెల్లడించారు.

## కాళేశ్వరంపై ఎవ్వరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదు

(మొదటిపేజీ తరువాయి)

పీసీ ఘోష్ కమిషన్ నియామకాన్ని పూర్తిగా సమర్థించిందని తెలిపారు. కమిషన్ ఫైండింగ్స్‌ను కూడా హైకోర్టు తప్పుపట్టలేదని చెప్పుకొచ్చారు. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ చట్టం 1952లోని సెక్షన్ 3 ప్రకారం జీవో ఎంఎస్ నంబర్ -6 ద్వారా ఏర్పాటు చేసిన విచారణ కమిషన్ రాజ్యాంగబద్ధమేనని న్యాయస్థానం స్పష్టం చేసిందని పేర్కొన్నారు. కమిషన్ ఏర్పాటు అధికార పరిధిని మించింది కాదని.. అసమంజసం కాదని, అక్రమం కాదని కూడా న్యాయస్థానం స్పష్టం చేసిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. జ్యుడిషియల్ కమిషన్ విచారణ నివేదికలో కొందరు బాధ్యులపై చేసిన నిర్ధారణలపై హైకోర్టు అభ్యంతరం తెలిపిందని చెప్పారు. పిటిషనర్లకు నిర్ణీత ఫార్మాట్ ప్రకారం నోటీసు ఇవ్వలేదనే టెక్నికల్ అంశాన్ని తప్పుపట్టిందన్నారు. జ్యుడిషియల్ కమిషన్ విచారణ నివేదిక ఆధారంగా వారిపై చర్యలు తీసుకోవద్దని పిటిషనర్లకు రిలీఫ్ ఇచ్చిందని చెప్పారు. ఇప్పటికే తమ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన లోపాలు, అవకతవకలపై సీబీఐతో విచారణ చేపట్టాలని నిర్ణయించిందని అన్నారు. సీబీఐకు లేఖ రాశామని ప్రస్తావించారు. ఈ రోజు వెలువడిన హైకోర్టు తీర్పు సీబీఐ విచారణకు అడ్డంకి కాదని.. న్యాయస్థానం ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని స్పష్టం చేశారు. హైకోర్టు పూర్తి తీర్పును పరిశీలించిన తర్వాత తదుపరి చర్యలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిందని ముమ్మాటికీ నిజమన్నారు. ప్రాజెక్టుకు ఎంచుకున్న సైట్ నుంచి డిజైన్ల నుంచి నిర్మాణాలు, నిర్వహణ అన్నిచోట్ల అవకతవకలు జరిగాయని.. అన్నీ లోపాలే ఉన్నాయని.. బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వారికి నోటీసులు ఇవ్వలేదనే కారణంగా, వాళ్లపై కమిషన్ చేసిన రిమార్క్స్ మాత్రమే ఇన్ ఆపరేటివ్‌గా ఉంటాయని హైకోర్టు తెలిపిందని అన్నారు. ఇది పూర్తిగా ప్రొసిజరల్, టెక్నికల్ అంశమని చెప్పుకొచ్చారు. కాళేశ్వరం ప్రజల కళ్లముందే కుంగిపోయిందని.. 2023 అక్టోబర్ 21వ తేదీన మేడిగడ్డ బ్యారేజీలో ఏడో బ్లాక్ కుంగిపోయిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆ బ్యారేజీ దగ్గరికు వెళ్తే ఎవరికైనా కుంగిన తీరు కనపడుతుందన్నారు. లక్ష కోట్లతో కట్టిన బ్యారేజీ మూడేళ్లకే కుంగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో కట్టిన ప్రాజెక్టు వాళ్ల హయంలోనే కుంగిపోయిందని అన్నారు. అందుకు కారణాలేమిటో తేల్చాల్సిన బాధ్యత.. తమ ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలోని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ కూడా బ్యారేజీల కుంగుబాటుకు దారి తీసిన కారణాలు, డిజైన్ల, నిర్మాణం, నిర్వహణ లోపాలపై తమ ప్రాథమిక నివేదికను బీఆర్ఎస్ హయాంలోనే సమర్పించిందని అన్నారు. బ్యారేజీలకు ఎంచుకున్న ప్రాజెక్టు సైట్ నుంచి డిజైన్లు, నిర్మాణంలో జరిగిన లోపాలన్నింటినీ తమ ప్రభుత్వం నియమించిన విజిలెన్స్ కమిషన్ బయటపెట్టిందని తెలిపారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన లోపాలు, అవకతవకలపై రాష్ట్ర ప్రభుత్వం వేసిన రిటైర్డ్ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ కూడా ఇంజనీర్లను, ఐఏఎస్‌లను, అప్పటి పరిపాలనా బాధ్యులను విచారించి నివేదికను వెల్లడించిందని తెలిపారు. బాధ్యులెవరు, దోషులెవరు.. ఎక్కడెక్కడ తప్పులు జరిగాయో తేలుస్తామని చెప్పారు. ఏమేం లోపాలున్నాయో.. ఎన్డీఎస్ఏతో పాటు విజిలెన్స్, పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికలపై ఆగస్టులోనే తమ ప్రభుత్వం అసెంబ్లీలో చర్చకు పెట్టిందని ప్రస్తావించారు. విజిలెన్స్, ఎన్డీఎస్ఏ, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికల ఆధారంగా దర్యాప్తు జరపాలని సీబీఐ విచారణకు ప్రభుత్వం లేఖ రాసిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గత ఏడాది సెప్టెంబర్ 1వ తేదీన తమ ప్రభుత్వం ఈ దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తూ జీవోతో పాటు నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు. హైకోర్టు తీర్పుతో సీబీఐ విచారణకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. తీర్పు కాపీ వచ్చాక ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. రెండేళ్లుగా ఆ ప్రాజెక్టు నుంచి చుక్క నీరు అందలేదని చెప్పుకొచ్చారు. ప్రతి ఏడాది ఈ ప్రాజెక్టు పేరిట ప్రభుత్వం రూ.15 వేల కోట్ల నుంచి రూ.20 వేల కోట్ల వరకు అప్పులు, వడ్డీలు భరిస్తుందని అన్నారు. కేవలం రెండు పిల్లర్లు కాదని.. మొత్తం పౌండేషన్.. మొత్తం మూడు బ్యారేజీల పునాదులు అనుమానాస్పదంగా ఉన్నాయని.. ఇప్పటికే దేశంలో పేరొందిన సంస్థల నిపుణులందరూ అభిప్రాయపడ్డారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తిగా మానవ తప్పిదమని చెప్పుకొచ్చారు. దేశంలోనే ఇది అతి పెద్ద విధ్వంసమన్నారు. అమూల్యమైన ప్రజాధనం వృథా అయిందని.. దీనికి బాధ్యులెవరో ప్రజల ముందు నిలబెట్టాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

## కాళేశ్వరం కథ ముగియలేదు

(మొదటిపేజీ తరువాయి)

కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. పలువురికి నోటీసులు ఇవ్వలేదని మాత్రమే హైకోర్టు చెప్పిందని వివరించారు. కాళేశ్వరం కమిషన్ నివేదికను హైకోర్టు తప్పుబట్టలేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ కమిషన్ విచారణ చేసి ఇచ్చిన నివేదికను కూడా హైకోర్టు తప్పుపట్టలేదన్నారు. లక్ష కోట్లు పెట్టి కట్టిన ప్రాజెక్ట్ కూలిపోయిందని.. లక్ష కోట్లు వృథా చేశారని టీపీసీసీ చీఫ్ మండిపడ్డారు. కమీషన్ల కక్కుర్తి వల్లే కాళేశ్వరం కూలిందని ఆరోపించారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని, ఏటీఎంలా మారిందని అమిత్ షా, నడ్డా చేసిన వ్యాఖ్యలు వాస్తవం కాదా కిషన్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. హైకోర్టు చెప్పిన కొన్ని అంశాలను చూసి సంబరాలు చేసుకుంటున్నారని బీఆర్ఎస్‌పై మహేశ్ గౌడ్ మండిపడ్డారు. పీసీ గోష్ రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందించారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉన్న ఎన్‌డీఎస్ఏ కూడా రిపోర్ట్ ఇచ్చిందన్నారు. కాళేశ్వరంలో నిర్మాణ లోపాలు ఉన్నాయని ఎన్‌డీఎస్ఏ చెప్పిందని తెలిపారు. హైకోర్టు ఎక్కడా కూడా బీఆర్ఎస్ అవినీతికి పాల్పడలేదని చెప్పలేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో కట్టిన ప్రాజెక్ట్ వారి హయాంలోనే కూలిందన్నారు. ఆలస్యమైనా దోషులు జైలుకు వెళ్లక తప్పదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

## వాయిదాల్లో ఓటుకు నోటు కేసు విచారణ

(మొదటిపేజీ తరువాయి)

విజయ్ బిష్ణోయ్ కూడా సభ్యుడిగా ఉన్నారు. మంగళవారం ఈ కేసు విచారణ జరిగింది. ముఖ్యంగా ఈ కేసులో రెండు కీలక పిటిషన్లు విచారణకు వచ్చాయి. ఒకటి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ కాగా, మరొకటి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ కీలక నేత సండ్ర వెంకట వీరయ్య దాఖలు చేసినది. సీఎం రేవంత్ రెడ్డి తన పిటిషన్‌లో ఓటుకు నోటు కేసును అవినీతి నిరోధక చట్టం కింద కాకుండా ఎన్నికల చట్టాల ప్రకారమే విచారించాలని కోరారు. ఈ కేసును క్రిమినల్ అవినీతి కేసుగా కాకుండా ఎన్నికల ఉల్లంఘనగా పరిగణించాలని ఆయన వాదించారు. మరోవైపు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య తనపై నమోదైన ఈ కేసులో తన పేరును పూర్తిగా తొలగించాలని సుప్రీంకోర్టును అభ్యర్థించారు. తనపై ఉన్న ఆరోపణలకు తగిన ఆధారాలు లేవని ఆయన వాదించారు. ఈ రెండు పిటిషన్లను కలిపి విచారించాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. దీంతో ఈ కేసు మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఓటుకు నోటు కేసు గతంలో కూడా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఓటుకు నోటు కేసు విచారణ వాయిదా పడినప్పటికీ, ఈ కేసు ప్రాధాన్యం మాత్రం తగ్గలేదు. వచ్చే విచారణలో కోర్టు తీసుకునే నిర్ణయాలు రాజకీయంగా కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో పారదర్శకత, నైతిక విలువలపై ఈ కేసు కీలకంగా నిలుస్తోంది.

## హైకోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు

(మొదటిపేజీ తరువాయి)

బట్టబయలు చేసిందని పేర్కొన్నారు. ఈ మేరకు కిషన్‌రెడ్డి ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగినట్లు ఆధారాలు ఉన్నప్పటికీ.. వాటిని చట్టపరంగా సమర్థవంతంగా కోర్టు ముందు ప్రవేశపెట్టడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. చట్టపరమైన ప్రమాణాలకు అనుగుణంగా తగిన ఆధారాలను సమర్పించలేకపోవడం వల్ల, కమిషన్ నివేదిక ఆధారంగా తదుపరి చర్యల విషయంలో కోర్టు ఇచ్చిన తీర్పు ప్రభుత్వ నిర్లక్ష్యానికి, అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. కాంగ్రెస్ మాటల ప్రభుత్వమే తప్ప చేతల ప్రభుత్వం కాదని మరోసారి నిరూపితమైందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర హైకోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని కిషన్‌రెడ్డి విమర్శించారు. అధికారంలోకి రాగానే.. కేసీఆర్, వారి కుటుంబ సభ్యులు, మంత్రులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేసిన అవినీతిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్, రేవంత్‌రెడ్డి పెద్ద పెద్ద హామీలు ఇచ్చారని ప్రస్తావించారు. కానీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తికావొస్తున్నా.. ఏ ఒక్క అవినీతి, అవకతవకలపై సమగ్ర దర్యాప్తు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో వేల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని సీఎం అన్నారని చెప్పారు.. అలాగే, ఫార్ములా వన్ రేస్ పేరు మీద చేసిన ఖర్చులు, డ్రగ్స్ కేసు, భూ ఆక్రమణలు, భూ కేటాయింపులు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి పథకాల్లో అవినీతి, అక్రమాలు జరిగాయని.. అవినీతి సొమ్మును కక్కిస్తానని పదే పదే రేవంత్‌రెడ్డి ప్రకటించినప్పటికీ వాటిపై ఒక్కటంటే ఒక్క చర్య కూడా ఎందుకు తీసుకోలేదని నిలదీశారు. కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులపై.. రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోకపోవడానికి కారణం.. ఈ రెండు పార్టీల మధ్య ఉన్న దోస్తీయేనని విమర్శించారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు 'డూప్ ఫైటింగ్' చేస్తూ.. 'నేను గిచ్చినట్లు చేస్తా, నువ్వు ఏడ్చినట్లు చేయి' అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయని కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలను రెండు పార్టీలు మోసం చేస్తున్నాయని ఆగ్రహించారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్ అవినీతి పాలన నుంచి విముక్తి కోసం.. మార్పు కావాలని కాంగ్రెస్‌కు ఓటేశారని తెలిపారు. కానీ రేవంత్ సర్కార్.. హామీలను మాటలకే పరిమితం చేస్తూ.. అవినీతికి పాల్పడిన వారిని ఎందుకు వదిలేస్తున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. గత రెండున్నరేళ్లుగా రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న కాంగ్రెస్ సర్కార్ అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ.. తెలంగాణ ప్రజాధనాన్ని అడ్డగోలుగా దోచుకుంటోందని ఆరోపించారు. అందుకనే బీఆర్ఎస్ హయాంలో జరిగిన అక్రమాలపై చర్యలకు కాంగ్రెస్ సర్కార్ వెనుకాడుతోందని విమర్శించారు. ఇది రేవంత్‌రెడ్డి పరిపాలనా వైఫల్యమని, ఇచ్చిన హామీలను విస్మరించి తెలంగాణ ప్రజలకు చేస్తున్న రాజకీయ ద్రోహమని కిషన్‌రెడ్డి దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. ఎన్నికలకు ముందు, ఎన్నికల తర్వాత, అసెంబ్లీలో, బయట ప్రజలకు ఇచ్చిన హామీల ప్రకారం వెంటనే.. అవినీతి కేసుల్లో చట్టబద్ధమైన, పారదర్శకమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈరోజు హైకోర్టు తీర్పు నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. ఎన్నికల హామీలు ఎందుకు అమలు కాలేదు..? అని ప్రశ్నించారు. అవినీతి కేసుల్లో చర్యలు ఎందుకు ఆలస్యమవుతున్నాయి..? అని నిలదీశారు. దొంగలు, దొంగలు కలిసి తెలంగాణను దోచుకోవడంలో పోటీపడుతూ.. రాష్ట్రాన్నినాశనం చేయాలని అనుకుంటున్నారా..? అని కిషన్‌రెడ్డి సెటైర్లు గుప్పించారు.

## ఎన్ని కుట్రలు పన్నినా న్యాయం గెలిచింది

(మొదటిపేజీ తరువాయి)

స్పందించారు. ఘోష్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవద్దని న్యాయస్థానం స్పష్టం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కుట్రలు బట్టబయలు అయ్యాయని, రేవంత్ నిజస్వరూపం హైకోర్టు తీర్పుతో తేటతెల్లం అయ్యిందంటూ హరీశ్ పోస్ట్ చేశారు. 'సత్యమేవ జయతే.. ఎవరెన్ని కుట్రలు చేసినా న్యాయస్థానాల్లో అంతిమంగా ధర్మం జయిస్తుందని, సత్యం నినదిస్తుందని ఈరోజు మరోసారి నిరూపితమైంది. ప్రాథమిక హక్కులు, సహజ న్యాయ సూత్రాలను విస్మరిస్తూ నడిపిన విచారణను ఉన్నత న్యాయస్థానం తప్పుబట్టింది. వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించేలా కమిషన్ చేసిన వ్యాఖ్యలు చెల్లవని, ఆ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోరాదని స్పష్టంగా తీర్పునిచ్చింది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కుట్రలు బట్టబయలయ్యాయి. ప్రజా సమస్యలు పక్కనపెట్టి డ్రామాలు ఆడిన రేవంత్ రెడ్డి నిజస్వరూపం హైకోర్టు తీర్పుతో తేటతెల్లం అయ్యింది. ఇప్పటికైనా కక్షసాధింపులు, రాజకీయ దుష్ప్రచారం మానేసి వెంటనే రెండు పిల్లర్ల మరమ్మతులు పూర్తి చేసి తెలంగాణ రైతుల ప్రయోజనాలు కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ఎవరు ఔనన్నా కాదన్నా... ముమ్మాటికీ కాళేశ్వరం తెలంగాణకు ప్రాణేళేశ్వరం.. జై తెలంగాణ.. జై కేసీఆర్' అంటూ మాజీ మంత్రి హరీశ్ రావు ట్వీట్ చేశారు.

## పీసీ ఘోష్ కమిషన్ కాదు.. ముమ్మాటికీ పీసీసీ నివేదిక

(మొదటిపేజీ తరువాయి)

సర్కార్ రాజకీయ కుట్రలు పక్కన పెట్టి రైతన్నల కోసం పని చేయాలని హితవు పలికారు. అది పీసీ ఘోష్ కమిషన్ కాదు, ముమ్మాటికీ పీసీసీ నివేదిక అని మేము ముందు నుంచి చెబుతుంది ఇవాళ అక్షరాల నిజమని తేలిపోయిందన్నారు.. కేసీఆర్‌పై దుష్ప్రచారం చేసిన వారి చెంప చెళ్లుమనించే విధంగా హైకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ఇవాళ గెలిచింది.. తెలంగాణ ప్రజలు, రైతులు, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కృషి చేసిన ఇంజినీర్లు. మూడేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరంపై దుష్ప్రచారం చేసింది. ఇవాళ తెలంగాణలో పారుతున్న ప్రతినీటి బొట్టు కేసీఆర్ కృషే. భూమిపై గోదావరి పారినన్ని రోజులూ కేసీఆర్ చరిత్రను ఎవరూ చెరిపివేయలేరు. అది పీసీ ఘోష్ కమిషన్ కాదు, పీసీసీ నివేదిక అని నేను అప్పుడే చెప్పాను. హైకోర్టు తీర్పుతో అందరికీ ఇవాళ జ్ఞానోదయం కలిగి ఉంటుంది. కాళేశ్వరం కచ్చితంగా తెలంగాణకు వరప్రదాయని. రూ.94వేల కోట్లు ఖర్చు అయితే.. రూ.లక్ష కోట్లు అని దుష్ప్రచారం చేశారు. కాళేశ్వరం అంటే ఒక్క బ్యారేజీ కాదు.. మూడు బ్యారేజీలు. మేడిగడ్డపై చేసిన ఖర్చు రూ.3,800 కోట్లు మాత్రమే. కాంగ్రెస్ కుట్రల వల్లే మేడిగడ్డ బ్యారేజీ కుంగిందని మరోసారి చెబుతున్నా. రాష్ట్రంలో చెక్‌డ్యామ్‌లను బాంబులు పెట్టి పేలుస్తున్నారు. ఈ విషయంలో కేంద్రం ఏం చేస్తోంది? మేడిగడ్డలో ఏం జరిగిందో విశ్రాంత జడ్జితో మళ్లీ విచారణ జరిపించాలని కేటీఆర్ అన్నారు. తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షగట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హైకోర్టు తీర్పు ఒక గట్టి 'చెంపపెట్టు' అని కేటీఆర్ అభివర్ణించారు. భారత రాజ్యాంగానికి, చట్టాలకు విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా దేశంలోని గౌరవ న్యాయస్థానాలు చూస్తూ ఊరుకోవని ఈ తీర్పుతో మరోసారి రుజువైందని కేటీఆర్ పేర్కొన్నారు. ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేయడంతో రాష్ట్ర ప్రభుత్వ రాజకీయ కుట్రలకు బ్రేక్ పడినట్లయిందని కేటీఆర్ స్పష్టం చేశారు. కమిషన్ విచారణలో సహజ న్యాయ సూత్రాలను పూర్తిగా విస్మరించడమే కాకుండా, నిబంధనలకు పాతరేశారని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గతంలోనే స్పష్టం చేశారని, ఆ విషయాలతో ఇవాళ హైకోర్టు కూడా ఏకీభవించడం హర్షణీయమని ఆయన తెలిపారు.



## ఆర్టీసీ సమ్మెతో బస్సులకు రెస్ట్

(మొదటిపేజీ తరువాయి)

కావడంతో మంగళవారం అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగారు. దీంతో బస్ డిపోల్లో ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. డిపోల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. సమ్మెతో రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పలు చోట్ల ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. కార్మికుల సమ్మెతో పెద్దపల్లిలో 150 బస్సులు డిపోనకే పరిమితమయ్యాయి. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు ఆందోళన చేపట్టారు. మహబూబ్‌నగర్‌లో 112 బస్సులు డిపోనకే పరిమితం కాగా.. ప్రయాణికుల కోసం 16 విద్యుత్ బస్సులను అధికారులు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో బస్సులన్నీ డిపోలకే పరిమితమయ్యాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో ఆర్టీసీ అద్దె బస్సులను నడుపుతోంది. కండక్టర్ లేకుండా వీటిని తిప్పుతోంది. మరోవైపు బస్సులు లేక పలు చోట్ల ప్రైవేట్ వాహనాలను ప్రయాణికులు ఆశ్రయిస్తున్నారు. అన్ని జిల్లాల వ్యాప్తంగా అర్ధరాత్రి నుంచే బస్సులను డిపోలకు పరిమితం చేశారు. రహదారులపై బైఠాయించి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉదయం నుంచి బస్సులన్నీ నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ వంటి మహానగరంలో దాదాపు రోజుకు 25 లక్షల మంది ప్రజా రవాణాను వినియోగిస్తున్నారు. ఇదే అదనుగా వారు అధిక ఛార్జీలను వసూలు చేస్తున్నారు.కరీంనగర్‌లో ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రైవేటు డ్రైవర్‌తో నడిపిస్తున్న అద్దె బస్సు లారీని ఢీకొట్టింది. కరీంనగర్‌లోకి కోతిరాంపూర్ బైపాస్ వద్ద బస్సు అదుపు తప్పడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. కాగా, శిక్షణ లేని డ్రైవర్లతో బస్సులు నడిపిస్తుండటం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీజీఎస్ ఆర్టీసీ కార్మికుల సమ్మెతో హైదరాబాద్ మెట్రో రైల్ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. మెట్రో రైళ్ల సంఖ్య, ఫ్రీక్వెన్సీ పెంచాలని నిర్ణయించారు. ఆర్టీసీ సమ్మె ముగిసేవరకూ 56 మెట్రో రైళ్లను నడపనున్నట్లు అధికారులు వెల్లడించారు. మియాపూర్- ఎల్.బి.నగర్ కారిడార్‌లో 4 నిమిషాల 20 సెకన్ల విరామంతో, అలాగే నాగోల్- రాయదుర్గం కారిడార్‌లో 3 నిమిషాల 40 సెకన్ల విరామంతో రోజంతా గరిష్ఠంగా 56 రైళ్లను నడపనున్నట్లు తెలిపారు. చివరి మెట్రో రైలు సర్వీస్ రాత్రి 11 గంటల తర్వాత కూడా పొడిగించేలా చర్యలు చేపట్టినట్లు మెట్రో అధికారులు పేర్కొన్నారు. అయితే, కార్మికుల సమ్మెతో నగరవాసులు మెట్రో రైళ్లపై ఆధారపడాల్సి వచ్చింది. ఉదయం నుంచి రైళ్లన్నీ కిక్కిరిసిపోతున్నాయి. నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు తండోపతండాలుగా మెట్రోస్టేషన్లకు తరలివస్తున్నారు. పెరిగిన ప్రయాణికుల రద్దీ దృష్ట్యా 56 మెట్రో రైళ్లను నడపాలని అధికారులు నిర్ణయించారు. మరోవైపు కార్మికుల సమ్మెపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తెలిపారు. సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కొన్ని సంఘాలు నిజాలను విస్మరించి కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణలో ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. సమస్యలు పరిష్కరించాలంటూ ఆర్టీసీ జేఏసీ సమ్మె బాట పట్టింది. మంగళవారం నాడు అధికారులతో చర్చలు విఫలం కావడంతో ఆందోళనకు దిగారు ఆర్టీసీ కార్మికులు. బస్సులను డిపోలకే పరిమితం చేసి రోడ్లపై బైఠాయించి నిరసనలకు దిగారు. సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె విరమించేది లేదని తేల్చి చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం సమ్మె విరమించాలని కార్మికులను కోరుతోంది. ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా బస్సులు నడపాలని సంబంధిత ఉన్నతాధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఒకే సూత్రాన్ని అన్ని మతాల ఆచారాలకు వర్తింపజేయడం అసాధ్యం

(మొదటిపేజీ తరువాయి)

మహిళల ప్రవేశం, పార్శీ మహిళల హక్కుల వంటి ఇతర మతపరమైన అంశాలను కూడా స్పృశిస్తోంది. ఒక మతానికి చెందిన ఆచారం లేదా నిబంధనను ప్రాతిపదికగా తీసుకుని, అదే సూత్రాన్ని అన్ని మతాల ఆచారాలకు వర్తింపజేయడం సాధ్యం కాదని ధర్మాసనం పేర్కొంది. శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశం, మతపరమైన ఆచారాల్లో ప్రభుత్వ జోక్యంపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు తొమ్మిది మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం కీలక విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు.. మత స్వేచ్ఛ, రాజ్యాంగ పరమైన హక్కుల మధ్య ఉన్న సున్నితమైన సంబంధాన్ని స్పష్టం చేస్తున్నాయి. మతపరమైన ఆచారాల్లో ప్రభుత్వం ఎంతవరకు జోక్యం చేసుకోవచ్చనే అంశంపై ముందస్తుగా ఎలాంటి ఉమ్మడి లేదా సార్వత్రిక నిబంధనలను విధించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తొమ్మిదిమంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ కీలక అంశాలపై స్పష్టతనిచ్చింది. ఆర్టికల్ 25 ప్రకారం పౌరులకు ఉన్న మత స్వేచ్ఛను గౌరవిస్తూనే, అవసరమైన చోట సామాజిక సంస్కరణల కోసం ప్రభుత్వం జోక్యం ఏ మేరకు ఉండాలనేది న్యాయస్థానం నిశితంగా పరిశీలిస్తోంది. ప్రభుత్వ జోక్యంపై ముందస్తుగా గైడ్‌లైన్స్ జారీ చేయడం వల్ల భవిష్యత్తులో వచ్చే వివిధ కేసుల విచారణకు ఆటంకం కలిగే ప్రమాదం ఉందని ధర్మాసనం భావించింది. మతపరమైన హక్కులు 'రాజ్యాంగ నైతికత'కు లోబడి ఉండాలా లేదా అనే కీలక ప్రశ్నపై ఈ విచారణ కొనసాగుతోంది. ఏడో రోజు విచారణ ద్వారా సుప్రీంకోర్టు మతపరమైన విషయాల్లో న్యాయవ్యవస్థ, ప్రభుత్వ పరిధులను అత్యంత జాగ్రత్తగా విశ్లేషిస్తోంది. శబరిమల తీర్పును పున:సమీక్షించే క్రమంలో వెలువడే ఈ నిర్ణయాలు భారతదేశంలోని అన్ని మతాల ఆచార వ్యవహారాలపై సుదూర ప్రభావం చూపే అవకాశం ఉంది.

## ప్రభుత్వ కాలేజీలు, హాస్పిటళ్ల అభివృద్ధికి

# ప్రతిపాదనలు రూపొందించండి

### అధికారులకు మంత్రి దామోదర ఆదేశాలు



**హైదరాబాద్, ఏప్రిల్ 22 :** రాష్ట్రంలో ప్రభుత్వ కాలేజీలు, హాస్పిటళ్ల అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. భారత సంప్రదాయ వైద్య సేవలకు ప్రాచుర్యం కల్పించి, ప్రజలకు ఉపయోగపడేలా ఆయుష్ డిపార్ట్‌మెంట్ పనివిధానం ఉండాలని మంత్రి సూచించారు. ఓపీ, ఐపీ పేషెంట్ల సంఖ్య మరింత పెరగాలన్నారు. అవసరమైన చోట డాక్టర్లు, సిబ్బందిని నియమించుకోవాలని ఆదేశించారు. సిద్ధిపేట, వికారాబాద్, భూపాలపల్లిలోని ఇంటిగ్రేటెడ్ ఆయుష్ హాస్పిటల్స్‌లో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించి, వీలైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి ఆదేశించారు. ఆయుష్ మెడిసిన్ సప్లైలో గ్యాప్ ఉండకూడదని, పేషెంట్లకు అవసరమయ్యే అన్నిరకాల మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రభుత్వ ఆయుర్వేద, హోమియోపతి డాక్టర్లు, సిబ్బంది అటెండెన్స్‌ను స్ట్రిక్ట్‌గా మానిటర్ చేయాలని మంత్రి ఆదేశించారు. డ్యూటీలకు గైర్హాజరయ్యే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. సరియైన అనుమతులు, అర్హతలు లేకుండా, ఆయుర్వేద, హోమియోపతి తదితర హాస్పిటళ్లు, క్లినిక్‌లు నడిపిస్తూ, తప్పుడు ప్రకటనలతో ప్రజలను దోచుకుంటున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆయుష్ డైరెక్టర్ శ్రీకాంత్ బాబును మంత్రి ఆదేశించారు. తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా ఆయుర్వేద, హోమియోపతి తదితర పేర్లతో నడుస్తున్న క్లినిక్‌లు, హాస్పిటళ్లను తనిఖీ చేయాలని, అవసరమైన అనుమతులు లేని హాస్పిటళ్లపై చర్యలు ప్రారంభించాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలో ఆయుష్ వైద్య సేవలపై నేచర్‌క్యూర్ హాస్పిటల్‌లో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ బుధవారం సమీక్ష చేశారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తూ, ఆయుష్ డైరెక్టర్ శ్రీకాంత్ బాబు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆయుష్ హాస్పిటల్స్, క్లినిక్‌లు, కాలేజీలు, తదితర అంశాలను మంత్రి ఆరా తీశారు.



## గిగ్ వర్కర్ల సంక్షేమానికి ప్రభుత్వం అండ

### మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి

**హైదరాబాద్, ఏప్రిల్ 22 :** విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన గిగ్ వర్కర్ల కుటుంబ సభ్యులకు కార్మిక మరియు గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి ఎక్స్‌గ్రేషియా చెక్కులను అందజేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. గిగ్ వర్కర్లు లోకుర్తి నరేష్, జీ. శ్యామ్ సుందర్ మరియు అహ్మద్ బిన్ అబ్దుల్ ఖాదర్ కుటుంబ సభ్యులకు మంత్రి స్వయంగా చెక్కులు అందజేశారు. సెక్రటేరియట్‌లోని తన ఛాంబర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులతో మంత్రి మాట్లాడుతూ, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఆలోచనలకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం గిగ్ వర్కర్లకు అండగా నిలుస్తూ అసెంబ్లీలో గిగ్ వర్కర్స్ వెల్ఫేర్ చట్టాన్ని ఆమోదించిందని తెలిపారు. గిగ్ వర్కర్లకు ఇలాంటి రక్షణ, భద్రతా వలయం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. ఏ కార్మికుడికి ఎలాంటి ఇబ్బంది వచ్చినా రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. గిగ్ వర్కర్లు అయినా, హమాలీలు అయినా అందరికీ ప్రభుత్వం నుండి తగిన సహాయం, పరిరక్షణ అందాల్సిందేనని అన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి గిగ్ వర్కర్ల యూనియన్ కీలక పాత్ర పోషించిందని, వారు కార్మిక శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఈ చర్యలను సాధ్యంచేసారని మంత్రి అభినందించారు. కార్యక్రమంలో కార్మిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ దాన కిషోర్, కార్మిక శాఖ అడిషనల్ కమిషనర్ ఈ. గంగాధర్, గిగ్ వర్కర్ల యూనియన్ నాయకుడు సలావుద్దీన్ మరియు ఇతరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ఆర్థిక సహాయం అందించడంతో పాటు తమకు అండగా నిలిచిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి, కార్మిక మరియు గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి గారికి కృతజ్ఞతలు తెలిపారు.



## దావోస్, గ్లోబల్ సమ్మిట్ పెట్టుబడులపై ఆరా

### అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ సూచన

**హైదరాబాద్, ఏప్రిల్ 22 :** ఎంఓయూలు కుదుర్చుకున్న కంపెనీలకు వివిధ ప్రాంతాల్లో కేటాయించాల్సిన భూములకు సంబంధించి పెండింగ్ భూసేకరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. కంపెనీలకు కల్పించాల్సిన సౌకర్యాలు, భవిష్యత్ అవసరాలకు సంబంధించి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని సూచించారు. పెట్టుబడులకు సంబంధించి దావోస్, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లో పలు కంపెనీలతో జరిగిన ఎంఓయూ లు, పురోగతిపై సమీక్షలో సిఎం రేవంత్ రెడ్డి చర్చించారు. వివిధ రంగాలలో పెట్టుబడులకు సంబంధించి ఇప్పటి వరకు గ్రౌండ్ అయిన కంపెనీలు, పెండింగ్ వివరాలను ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ఫ్యూచర్ సిటీతో పాటు వివిధ ప్రాంతాల్లో సంస్థలకు ప్రాధాన్యతల వారీగా కేటాయించాల్సిన భూ వివరాలను సీఎంకు తెలిపారు. డేటా సెంటర్లకు అవసరమైన నీటిని ఎస్టీపీల ద్వారా శుద్ధి చేసిన నీటిని వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. పెట్టుబడులకు ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలను మూడు కేటగిరీలుగా విభజించాలని సిఎం అన్నారు. పేరున్న బ్రాండ్ సంస్థలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. వీలైనంత త్వరగా ఎంఓయూలు కుదుర్చుకున్న సంస్థలు తమ కార్యకలాపాలు మొదలు పెట్టేలా చూడాలని, ఇందుకు అవసరమైన అన్ని రకాల సదుపాయాలను కల్పించాలన్నారు.

## కాళేశ్వరం అవినీతి

# జగమెరిగిన సత్యం

- అన్ని నివేదికలు ఇదే చెప్పాయి
- హైకోర్టు తీర్పుపై కోదండరామ్ వ్యాఖ్య

**హైదరాబాద్, ఏప్రిల్ 22 :** కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించి తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై టీజేఏసీ అధ్యక్షులు కోదండరాం స్పందించారు. హైకోర్టు తీర్పుపై బీఆర్ఎస్ నేతలు ఎందుకు సంబరాలు చేసుకుంటున్నారో అర్థం కావడం లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో అవినీతి జరిగిందని, లోపాలు ఉన్నాయని కాగ్, విజిలెన్స్, ఎన్‌డీఎస్‌ఏ రిపోర్ట్‌లు ఇచ్చాయని తెలిపారు. ఈ నివేదికల ఆధారంగా కూడా చర్యలు తీసుకోవచ్చన్నారు. విచారణ చేయకపోతే సీబీఐదే తప్పవుతుందని టీజేఏసీ అధ్యక్షులు చెప్పుకొచ్చారు. కాళేశ్వరంలో తప్పు జరిగిందని తెలుస్తున్నప్పుడు చర్యలు తీసుకోడానికి ఇబ్బంది ఏంటని కోదండరాం ప్రశ్నించారు. 'బ్యారేజ్ నిర్మాణంలో పిల్లర్లు కుంగిపోయినవి మనకు కనిపిస్తుంది కదా... ఇంకేం కావాలి' అని అన్నారు. కాళేశ్వరంపై హైకోర్టు తీర్పు ఎవరికీ చెంపపెట్టు కాదని కోదండరాం స్పష్టం చేశారు.

## అనిల్ జైన్‌పై చర్య తీసుకోండి

### జలశక్తి మంత్రికి బండి లేఖ

**హైదరాబాద్, ఏప్రిల్ 22 :** కేంద్ర జల్‌శక్తి మంత్రికి కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ బుధవారం లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. ఎన్డీఎస్ఏ చైర్మన్ అనిల్ జైన్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి కార్యక్రమంలో ఆయన పాల్గొనడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈనెల 20వ తేదీన రాజకీయ ప్రయోజనాల కోసం రేవంత్‌రెడ్డి మేడిగడ్డను సందర్శించారని చెప్పుకొచ్చారు. ఆ కార్యక్రమంలో అనిల్ జైన్ ఎలా పాల్గొంటారని ప్రశ్నించారు. భవిష్యత్తులో బ్యారేజీలకు మరింత నష్టం జరిగితే.. ఎన్డీఎస్ఏపై కాంగ్రెస్ ప్రభుత్వం నిందమోపే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ కమిటీ సిఫార్సులను నీరుగార్చేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. కేంద్రానికి చెడ్డపేరు తెచ్చేందుకు యత్నిస్తున్నారని ఆగ్రహించారు. అనిల్ జైన్‌పై వెంటనే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని బండి సంజయ్ కుమార్ సూచించారు.

## హజ్ యాత్రకు

# పదివేల మంది సిద్ధం

- సకాలంలో వారిని హజ్‌కు పంపాలి
- అధికారులతో సమీక్షలో మంత్రి అజారుద్దీన్

**హైదరాబాద్, ఏప్రిల్ 22 :** తెలంగాణ మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్ హజ్–2026 ఏర్పాట్లపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ నుండి ప్రయాణించే సుమారు 10,000 మంది యాత్రికులకు ఉత్తమ సౌకర్యాలు కల్పించాలని అన్ని శాఖలకు ఆదేశాలు జారీ చేశారు. రవాణా, భద్రత, వైద్య సేవలు, విమానాశ్రయ సమన్వయం, యాత్రికుల సంక్షేమ చర్యలు సమర్థవంతంగా అమలు అవుతున్నాయి. తెలంగాణ సచివాలయంలో హజ్–2026 ఏర్పాట్లపై ఉన్నతస్థాయి సమీక్ష చేశారు. ఎంబార్కేషన్ పాయింట్ నుండి ఈ సంవత్సరం హజ్ యాత్రకు బయలుదేరనున్న సుమారు 10,000 మంది యాత్రికులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రపంచ స్థాయి ఏర్పాట్లు చేయాలని అన్ని శాఖలకు ఆదేశించారు. యాత్రికుల వసతి, రవాణా, విమానాశ్రయ కార్యకలాపాలు, వైద్య సేవలు, భద్రత, సామాను రవాణా, జమ్‌జమ్ పంపిణీ తదితర అంశాలపై మంత్రి సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ నుండి జెడ్డాకు హజ్ చార్టర్ విమానాలు మే 4 నుండి మే 21, 2026 వరకు నడవనున్నాయి. తిరుగు ప్రయాణ విమానాలు మదీనా నుండి హైదరాబాద్‌కు జూన్ 11 నుండి జూన్ 26, 2026 వరకు కొనసాగనున్నాయి. వృద్ధులు, మహిళలు, తొలిసారి హజ్ యాత్రకు వెళ్తున్న వారికి మంత్రి అజారుద్దీన్ అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని అధికారులు తెలిపారు. వారు గౌరవప్రదంగా, ప్రశాంతంగా తమ ఆధ్యాత్మిక యాత్ర పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నారు.

# డిమాండ్లు పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం

**ఆర్టీసీ డిపోల ఎదుట నేడు మహాధర్నాకు పిలుపు**

**సమస్యలపై ప్రభుత్వం చిత్తశుద్ధితో లేదన్న జేఏసీ**



**హైదరాబాద్, ఏప్రిల్ 22 :** తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ టీజీఎస్ ఆర్టీసీ ప్రారంభించిన సమ్మెను నేటి నుంచి మరింత ఉధృతం చేసేందుకు సన్నహాలు ప్రారంభించింది. గురువారం అన్ని ఆర్టీసీ డిపోల ఎదుట మహాధర్నాను నిర్వహించాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఉదయం 5 గంటల నుంచి ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం, యాజమాన్యం సమ్మె డిమాండ్లను పరిష్కరించకుండా మొండిగా వ్యవహరిస్తూ దాటవేత ధోరణి అవలంబిస్తూ, ప్రజలను ఆర్టీసీ కార్మిక వర్గాన్ని తప్పుదారి పట్టిస్తున్నదని ఆరోపించారు. ప్రభుత్వం వేసిన కమిటీ అధికారులే ఇప్పటి కిప్పుడు సమస్యలు పరిష్కరించలేమని చేతులెత్తేయడం వల్ల విధిలేని పరిస్థితుల్లో సమ్మెను ప్రారంభించ వలసి వచ్చిందని వెల్లడించారు. ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలలో ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగులను విలీనం చేసేంతవరకు, 2021 వేతన సవరణ 30 శాతం తగ్గకుండా అమలు చేసేంతవరకు, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రైవేట్ ఎలక్ట్రికల్ బస్సులను రద్దుచేసి ఇతర జోన్లకు ఉద్యోగులను బదిలీ చేసే ఉత్తర్వులను రద్దు చేసే వరకు తమ ఆందోళనను కొనసాగిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోలు, అన్ని యూనిట్లు, అన్ని వర్క్ షాప్ లలో మహాధర్నాలను జయప్రదం జేయాలని జేసీసీ నాయకులు కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొంటున్నారని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న తెలిపారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. అమరవీరులకు నివాళులర్పించి సమ్మెను ముందుకు తీసుకెళ్తామని.. కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు. ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కాలయాపన కోసమే ప్రభుత్వం కమిటీ వేసిందని విమర్శించారు. కమిటీ అవసరం లేదని.. తక్షణమే సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు జేఏసీ చైర్మన్ తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే పక్రియను సర్కార్ వెంటనే ప్రారంభించాలని వెంకన్న డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగుతుందని.. వెనక్కి తగ్గమని స్పష్టం చేశారు. ప్రజా సంఘాలు సంపూర్ణంగా మద్దతిచ్చాయని... మరో సకల జనుల సమ్మెగా మారుస్తామని అన్నారు. సమ్మెకు మంద కృష్ణ మాదిగ, బీసీ సంఘం నేత ఆర్.కృష్ణయ్య మద్దతు ఇస్తున్నారని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం తమను చర్చలకు ఆహ్వానించాలని.. మరో సకల జనుల సమ్మె కాకుండా చూసుకోవాలని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న హెచ్చరించారు.

## ఈడీ విచారణలో

# జోక్యం చేసుకోవడమేంటి?

### మమతా బెనర్జీ తీరుపై సుప్రీం ఆగ్రహం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 22 :** పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీరుపై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మనీలాండరింగ్ వ్యవహారంలో రాజకీయ కన్సల్టెన్సీ సంస్థ 'ఐప్యాక్'పై జరుగుతున్న ఈడీ విచారణలో ముఖ్యమంత్రి, ఉన్నతాధికారులు నేరుగా కలగజేసుకోవడం సరికాదని, ఆమె చర్యలు ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెట్టేలా ఉన్నాయని వ్యాఖ్యానించింది. బెంగాల్‌లో చోటుచేసుకున్న బొగ్గు కుంభకోణానికి సంబంధించిన నమోదైన మనీలాండరింగ్ కేసుపై ఈడీ గత కొన్నాళ్లుగా దర్యాప్తు చేస్తోంది. అయితే, ముఖ్యమంత్రి మమతాబెనర్జీతోపాటు ప్రభుత్వ అధికారులు దర్యాప్తులో జోక్యం చేసుకుంటున్నా రంటూ ఈడీ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం.. ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి ఇలా ప్రవర్తించే పరిస్థితి తలెత్తుతుందని రాజ్యాంగనిర్మాత అంబేద్కర్ ఎప్పుడూ ఊహించి ఉండరని వ్యాఖ్యానించింది. ఇది రాష్ట్రానికి, కేంద్రానికి మధ్య వివాదం కాదు. ఓ ముఖ్యమంత్రి నేరుగా విచారణలో జోక్యం చేసుకోవడం సమర్థనీయం కాదు. ఈ అంశాన్ని కేంద్రానికి, రాష్ట్రానికి మధ్య వివాదంగా తయారు చేయొద్దు. మీ చర్యలు ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నాయని మమతాబెనర్జీని ఉద్దేశించి సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. ఈడీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఐప్యాక్ సహ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ ప్రతీక్‌జైన్ ఇంట్లో ఈడీ సోదాలు నిర్వహిస్తున్న సమయంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, తన అధికారులతో కలిసి అక్కడకు ప్రవేశించినట్లు కోర్టుకు వెల్లడించారు.

## తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లో

## భారీగా నగదు, మద్యం, నగలు పట్టివేత

### దాదాపు వేయికోట్లు ఉంటుందని ఎన్నికల సంఘం వెల్లడి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 22 :** ఎన్నికల వేళ రాజకీయ పార్టీలు ధనం, మద్యం, ఉచితాలతో ఓటర్లను ప్రలోభపెడుతుండటం సర్వసాధారణంగా మారింది. ఇలాంటి ప్రలోభాలపై ఈసీ డేగకన్ను వేస్తుంటుంది. తాజాగా తమిళనాడు, పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఉద్దేశించిన రూ.1,000 కోట్లకు పైగా విలువచేసే నగదు, మద్యం, డ్రగ్స్, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. పశ్చిమబెంగాల్‌లో రూ.472.89 కోట్లు, తమిళనాడులో రూ.599 కోట్లు విలువచేసే నగదు, మద్యం, ఆభరణాలు, డ్రగ్స్, ఉచితాలు స్వాధీనం చేసుకున్నట్టు ఈసీ వెల్లడించింది. ఇందులో రూ.127.67 కోట్ల నగదు, రూ.106.3 కోట్ల విలువైన మద్యం, రూ.184.83 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలు, రూ.215.19 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు, రూ.437.97 కోట్ల విలువైన ఇతర ఉచితాలు ఉన్నట్టు ఈసీ తెలిపింది. తమిళనాడు, పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఈనెల 23న జరుగనుంది. తమిళనాడులో ఒక విడతలో పోలింగ్ జరుగనుండగా, బెంగాల్‌లో రెండు విడతలుగా జరుగనుంది. అక్కడ రెండో విడత పోలింగ్ ఈనెల 29న ఉంటుంది. ఈ రెండు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలతో పాటు ఇప్పటికే పోలింగ్ పూర్తయిన అస్సాం, కేరళ, పుదుచ్చేరి ఎన్నికల ఫలితాలు మే 4న ప్రకటిస్తారు.



## పర్యాటక రంగంలో

# రివర్స్ టూరిజం

- ఆదివాసీ టూరిజం ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్
- జెండా ఊపి ప్రారంభించిన మంత్రి జూపల్లి
- ఆదివాసీలతో కలిసి బస్సులో ప్రయాణించిన మంత్రి

**నిర్మల్, ఏప్రిల్ 22 :** రాష్ట్ర పర్యాటక రంగ చరిత్రలో సరికొత్త ఒరవడికి నాంది పడింది. కేవలం నగరవాసులు ప్రకృతిని చూడటానికి పల్లెలకు వెళ్లడమే కాకుండా, అడవి బిడ్డలు సైతం ఆధునిక అభివృద్ధిని, చారిత్రక వైభవాన్ని కళ్లారా చూడాలన్న సంకల్పంతో పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు 'రివర్స్ టూరిజం'కు శ్రీకారం చుట్టారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలం గోండు గూడెంలో బుధవారం నిర్వహించిన 'ఆదివాసీ టూరిజం ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్'ను మంత్రి జూపల్లి కృష్ణారావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. ఆదివాసీలకు కొత్త అనుభవాలు ఇవ్వడం, నగర జీవన విధానం పరిచయం చేయడం, ఆత్మవిశ్వాసం పెంచడం, రెండు సంస్కృతుల మధ్య అవగాహన పెంచడం, సాంస్కృతిక మార్పిడి, అంతిమంగా ఆదివాసీల జీవన ప్రమాణాలు మెరుగుపరచాలనే లక్ష్యంతో ఈ వినూత్న కార్యక్రమానికి రూపకల్పన చేసినట్లు వివరించారు. కార్యక్రమాన్ని ప్రారంభించడమే కాకుండా, మంత్రి జూపల్లి స్వయంగా ఆదివాసీలతో కలిసి బస్సులో ప్రయాణించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ప్రయాణ పొడవునా వారితో ముచ్చటిస్తూ పర్యటన లక్ష్యాన్ని వివరించారు. 5 ప్రత్యేక బస్సుల్లో బయలుదేరిన 250 మంది ఆదివాసీలు మధ్యాహ్నం హైదరాబాద్‌లోని తారామతి బారాదరికి చేరుకుంటారు. రెండు రోజుల పాటు సాగే ఈ పర్యటనలో విమానాశ్రయం, చార్మినార్, గోల్కొండ కోట, లుంబినీ పార్క్, శిల్పారామం వంటి ప్రాంతాలను వీరు సందర్శించనున్నారు. కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటీడీఏ పీఓ యువరాజ్ మర్మట్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్ కామ్డే పాల్గొన్నారు. వీరితో పాటు డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్, ఆత్రం సుగుణ, కాంగ్రెస్ నాయకులు ఆత్రం సక్కు, సోయం బాపురావు, ఆడే గజేందర్ తదితరులు పాల్గొన్నారు,



## సరస్వతీ అంత్య పుష్కరాలకు

# గవర్నర్‌కు ఆహ్వానం

**హైదరాబాద్, ఏప్రిల్ 22 :** దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ ఎన్. హనుమంతరావు లు బుధవారం లోక్ భవన్‌లో రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లాను కలిసి రానున్న సరస్వతీ అంత్య పుష్కరాలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా గోదావరి పుష్కరాలు (జూన్ 26 నుంచి జూలై 7, 2027 వరకు), సరస్వతి అంత్య పుష్కరాలు (మే 21 నుంచి జూన్ 1, 2026 వరకు) నిర్వహణకు చేపడుతున్న ఏర్పాట్లపై దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి గవర్నర్‌కు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. పుష్కరాలను సజావుగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్ తెలిపారు. భక్తుల వసతి సదుపాయాలు, క్రౌడ్ మేనేజ్మెంట్ చర్యలు, ముఖ్య ఆలయాలు?వాటి ప్రాధాన్యత, శాఖల మధ్య సమన్వయం వంటి అంశాలపై గవర్నర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిశోర్ కూడా సమావేశంలో పాల్గొన్నారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీ కృష్ణ బుధవారం లోక్ భవన్‌లో గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు.



## అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి రూ.148 కోట్లు

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ

**హైదరాబాద్, ఏప్రిల్ 22 :** తెలంగాణలో అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి రూ.148 కోట్లకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. బ్రిడ్జిలు ఉన్నా అప్రోచ్ రోడ్లు లేక నిరుపయోగంగా మారాయని కేబినెట్ దృష్టికి వచ్చింది. పెండింగ్‌లో ఉన్న అప్రోచ్ రోడ్ల పనులను వెంటనే ప్రారంభించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ చేశారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన ఇన్‌ఫ్రా అండ్ క్యాపిటల్ వర్క్స్ కేబినెట్ సబ్ కమిటీ బుధవారంసచివాలయంలో సమావేశమైంది. ఈ సమావేశంలో సబ్ కమిటీ కీలక నిర్ణయాలు తీసుకుంది. 1:4 నిష్పత్తిలో ప్రతిపాదనలు పంపాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సరైన ప్రతిపాదనలు ఉంటే త్వరితగతిన ఆమోదించాలని మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. జూన్ 8వ తేదీలోపు పనులు పూర్తి చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మార్గనిర్దేశం చేశారు. ప్రతి వారం పనుల పురోగతిపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. టెండర్లు, పనుల నాణ్యతపై కఠిన పర్యవేక్షణ ఉంటుందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు.

# నేడు తెలంగాణ కేబినేట్ భేటీ

### కాళేశ్వరం తదితర అంశాలపై చర్చించే అవకాశం

**హైదరాబాద్, ఏప్రిల్ 22 :** నేడు తెలంగాణ కేబినేట్ భేటీ అవుతోంది. వివిధ అంశాలపై కేటినేట్లోఓ చర్చించనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై విచారణ జరుపుతున్న జస్టిస్ ఘోష్ కమిషన్ విషయంలో తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పు రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించింది. ఈ తీర్పు నేపథ్యంలో తదుపరి కార్యాచరణను ఖరారు చేసేందుకు కేబినేట్‌లో చర్చించే అవకాశం ఉంది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం రాష్ట్ర మంత్రివర్గ అత్యవసర సమావేశం భేటీ అవుతోంది. హైకోర్టు ఇచ్చిన తీర్పులోని అంశాలను లోతుగా విశ్లేషించి, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం వేయబోయే తదుపరి అడుగు గురించి ఈ భేటీలో కీలక నిర్ణయం తీసుకోనున్నారు. ఈ పరిణామాలపై ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందిస్తూ, బీఆర్ఎస్ నేతలు ఆశించినట్లుగా వారికి కోర్టు నుంచి ఎటువంటి 'క్లీన్ చిట్' లభించలేదని స్పష్టం చేశారు. కేసీఆర్ , హరీష్ రావు కోరినట్లుగా కమిషన్ ఏర్పాటును కోర్టు తప్పుబట్టలేదని, కేవలం కొన్ని సాంకేతిక అంశాలను మాత్రమే ప్రస్తావించిందని ఆయన వివరించారు. కమిషన్ నియామకాన్ని కోర్టు సమర్థించడం ప్రభుత్వ ధోరణికి దక్కిన విజయమని ఆయన అభిప్రాయపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టూ తిరుగుతున్న న్యాయపరమైన ఉత్కంఠకు రేపటి కేబినెట్ సమావేశం ఒక దిశను చూపే అవకాశం ఉంది.

# ర్యాంకుల గోలతో విద్యార్థులపై ఒత్తిడి!




**టీవీలు, పేపర్ల నిండా ర్యాంకుల గోల. మా వద్ద చదివిన వారికి ర్యాంకులే ర్యాంకులు అంటూ... ప్రకటనలు..1,2,3 ఇలా టీవీల్లో ఊదరగొడుతున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే...ర్యాంకుల గొడవలో పిల్లల్లో సృజనాత్మకతను దెబ్బతీస్తున్నారు. లక్షల్లో ఫీజులు వసూళ్లు చేసి, పేద మధ్యత తరగతి వారిని మాయలో పడేస్తున్నారు. ఇంతపెద్ద దేశంలో ఇలాంటి చదువులు సాగుతున్నందుకు సిగ్గుపడాలి. ప్రభుత్వ విద్యారంగం పూర్తిగా భ్రష్టు పడుతోంది. ప్రభుత్వ హాస్టళ్లు నానాటికి తీసికట్టుగా తయారవుతున్నాయి. విద్యార్థులకు సరైన తిండి దక్కడం లేదు. ఫుడ్ పాయిజనింగ్‌తో చస్తున్నారు. అయినా పెద్దగా చర్యలు తీసుకోవడం లేదు. నానా రకాల పేర్లతో హాస్టళ్లు పెట్టి పిల్లలను ఘోష పెడుతున్నారు. ఇక ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజలు కట్టుకోలేనంత, తట్టుకోలేనంతగా ఉన్నాయి.**

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలకు చీమకుట్టినట్లు కూడా లేదు. తల్లిదండ్రులు ధర్నాలు చేసినా, ఫీజలు భారం నుంచి తప్పించడం లేదు. జీవితమంటే చదువులు, మార్కులు, ర్యాంకులే అన్న విధంగా విద్యారంగం తయారయ్యింది. ప్రైవేట్ మాఫియాలో అసలు విద్య గంగలో కలసిపోతోంది. ర్యాకులే విజయానికి కొలమానాలుగా మారాయి. నేటి విద్యావిధానం మార్కులు, ర్యాంకుల చుట్టూనే తిరుగుతోంది. పిల్లల ప్రతిభను ఈ కొలమానంతో కొలవడం దారుణం. ర్యాంకుల వేటలో పిల్లల మానసిక ఒత్తిడిని పెంచుతున్నారు. ఇటీవలి కాలంలో విద్యార్థుల ఆత్మహత్యలు సామాజిక సమస్యగా మారింది. చదివేది, పరీక్షలు రాసేదీ విద్యార్థులైతే, వాటి ఫలితాల కోసం ఎదురు చూసేది, వారి భవితపై అంచనాలు పెంచుకునేది వారి తల్లిదండ్రులు. వారి ర్యాంకులతో వ్యాపారం చేసేది ఆయా విద్యా సంస్థలు. ఈ ఒత్తిళ్ల మధ్య చదువులు, ర్యాంకుల వాతావరణానికి తోడు రకరకాల ఆర్థిక, సామాజిక, వివక్షల వంటి అనేక కారణాలు విద్యార్థుల్లో విపరీతమైన మానసిక సమస్యలను సృష్టిస్తున్నాయి. తల్లిదండ్రుల అంచనాల ను, విద్యాసంస్థల ఒత్తిళ్లను తట్టుకోలేక కుంగుబాటుతో, నిస్సహాయతతో కొందరు బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. తాజాగా వచ్చిన ఇంటర్ ఫలితాల అనంతరం పదుల్లో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు.

పరీక్షల్లో ఫెయిలైతే జీవితం ముగిసిపోయినట్లే అన్న భావనలో..ఆత్మహత్యలే శరణ్యమని భావిస్తున్నారు. జీవితంలో చదువు, కెరీర్ ఒక భాగం మాత్రమే. అని వారికి అవగాహన కల్పించడం లేదు. మంచిచెడుల విచక్షణను తెలియ జెప్పడం లేదు. ఇంటర్ ఫలితాలు వచ్చాక ఇటీవల తెలంగాణలో ఒక్క రోజులోనే ఏడుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటే, ఎపి లో ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. టెన్త్, ఇంటర్ ఫలితాలొచ్చిన ప్రతిసారీ చిన్నారుల ఆత్మహత్యల వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. కార్పొరేట్ విద్యా ఫ్యాక్టరీలు ర్యాంకుల కోసం విద్యార్థులను యంత్రాల్లా మార్చుతున్నాయి. పిల్లలపై తల్లిదండ్రుల అంచనాలకు హద్దు లేకుండా పోతోంది. వారి అంచనాలను అందుకోలేక మరొకరితో పోల్చడాన్ని తట్టుకోలేక.. బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. ఇవి కేవలం పిల్లల వ్యక్తిగత వైఫల్యాల ఫలితం కాదు. సమాజం, విద్యావ్యవస్థలోని లోపాలను ప్రతిబింబిస్తోంది. సుప్రీంకోర్టు సైతం ఇది వ్యవస్థాగత లోపానికి నిదర్శనం అని వ్యాఖ్యానించిందంటే.. పరిస్థితి తీవ్రత ఎంతగా వుందో అర్థం చేసుకోవచ్చు. పరీక్షల ఒత్తిడిలో వున్న పిల్లలకు కుటుంబ సభ్యుల మద్దతు ఎంతో అవసరం. వారికి మానసిక స్థయిర్యాన్ని ఇవ్వడం ముఖ్యం. మార్కులు, ర్యాంకుల కోసమే పుట్టలేదన్న విషయం పిల్లల్లో నూరిపోయాలి. ఫెయిలైతే మళ్లీ చదువుకునేందుకు అవకాశం ఉంది. అసలు చదువే ఇష్టం లేకపోతే అభిరుచి వున్న మరో రంగంలో సత్తా చాటడానికి విశాల ప్రపంచం ఉంది. తరగతి గదిలో వెనకబడిన వారు జీవితంలో అద్భుతాలు సాధించిన ఘటనలు అనేకం చరిత్రలో వున్నాయి.

సచిన్ టెండూల్కర్, ధోనీ వంటి ప్రముఖ క్రికెటర్లు హైస్కూల్ చదువులతోనే సరిపెట్టుకున్నారు. ఇప్పుడు పేరున్న వారంతా అభిరుచి కలిగిన రంగంలో స్వయంకృషితో ఎదిగినవారే. ఇంటర్ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయనో, పదిలో ఫెయిల్ అయ్యామనో తనువు చాలిస్తే భవిష్యత్‌లో దేశం ఒక గొప్పవ్యక్తిని కోల్పోయినట్టే. మన శ్రమతో కొత్త చరిత్రను లిఖించాలి. ఇవన్నీ ఒక ఎత్తయితే విద్యారంగంలో సంస్కరణలు ముఖ్యం. ర్యాంకుల గోల, ఫీజలు గోల పోయేలా ప్రభుత్వరంగంలో స్కూళ్లను, కాలేజీలను బలోపేతం చేయాలి. ఒకేతరహా విద్య అందరికీ అందేలా చేయాలి. ముఖ్యమంగా ప్రైవేట్ స్కూళ్ల దోపిడీని అరికట్టాలి. లక్షల్లో ఫీజులు వసూళ్ల దందాను ఆపాలి. అలాగే ర్యాంకుల చదవులను ఆపాలి. పలు తరహాల సిలబస్‌లకు బ్రేక్ వేయాలి. ప్రధానంగా ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేసి, టీచర్లను నియమిస్తే..పేదలు కార్పోరేట్ స్కూళ్ల మోజులో పడరు. వాటి వెనకాల పరుగెత్తరు. ఇది గుర్తించి ఉమ్మడి ఎపిలో ప్రభుత్వాలు చర్యలకు ఉపక్రమించాలి.

## సైబర్ నేరాలను అరికట్టాలంటే బ్యాంకింగ్ వ్యవస్థలో

# సమూల ప్రక్షాళన అవసరం

### ఆర్‌బిఐ గవర్నర్ మల్హోత్రాకు సిపి సజ్జన్నార్ లేఖ



**హైదరాబాద్, ఏప్రిల్ 22 :** సైబర్ నేరాలను అరికట్టాలంటే బ్యాంకింగ్ వ్యవస్థలో సమూల ప్రక్షాళన అవసరమని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ పేర్కొన్నారు. సైబర్ ముఠాలకు 'మ్యూల్ అకౌంట్లు' వరంగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నగర పోలీసులు చేపట్టిన 'ఆపరేషన్ ఆక్టోపస్' దర్యాప్తులో వెలుగుచూసిన అంశాల ఆధారంగా బ్యాంకింగ్ వ్యవస్థలోని లోపాలను వివరిస్తూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రాకు లేఖ రాశారు. ఖాతాల ప్రారంభంలో కేవైసీ ధ్రువీకరణలో జరుగుతున్న నిర్లక్ష్యం ప్రధాన సమస్యగా ఉందని సీపీ పేర్కొన్నారు. బ్రాంచ్ స్థాయి అధికారులపై జవాబుదారీతనం నిర్ధారిస్తూ అన్ని వాణిజ్య బ్యాంకులకు కఠిన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఆర్బీఐ మార్గదర్శకాల అమలుపై తక్షణమే సిస్టమిక్ ఆడిట్ నిర్వహించాలని సూచించారు. ప్రజల సొమ్మును కాపాడాల్సిన కొంతమంది బ్యాంకు అధికారులే సైబర్ నేరగాళ్లతో కుమ్మక్కవుతున్నారని పేర్కొన్నారు. మహారాష్ట్రలోని నాసిక్‌లో ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ లో జరిగిన ఘటనను ప్రస్తావిస్తూ కేవైసీ వెరిఫికేషన్‌లో జరిగిన లోపాలు భద్రతా వైఫల్యానికి నిదర్శనమని తెలిపారు. సైబర్ నేరాలకు సహకరించిన బ్యాంకు అధికారులను గుర్తించి ఆర్బీఐకి నివేదించి వారిని శాశ్వత బ్లాక్‌లిస్ట్‌లో చేర్చాలని సూచించారు. మ్యూల్ అకౌంట్లపై నిరంతర పర్యవేక్షణ కోసం ఆర్బీఐ, బ్యాంకులు, పోలీసులతో కూడిన జాయింట్ వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. వాట్సాప్, టెలిగ్రామ్ వంటి వేదికల్లో వచ్చే అధిక లాభాల ప్రకటనలను నమ్మవద్దని, 'డిజిటల్ అరెస్ట్' పేరిట వచ్చే బెదిరింపులకు భయపడవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైతే 'గోడలెన్ అవర్'లో 1930 నంబర్‌కు కాల్ చేయాలని లేదా అధికారిక వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సీపీ సూచించారు.

# సమ్మెతో సమస్యలు పరిష్కారం కావు

- వెంటనే సమ్మె విరమించి రండి
- ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం వినతి



**హైదరాబాద్, ఏప్రిల్ 22 :** ఆర్టీసీ సమ్మెను విరమించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. సమస్యలకు సమ్మె పరిష్కారం కాదని ఆయన సూచించారు. సమస్యల పరిష్కారానికి నలుగురు అధికారులతో కమిటీ ఏర్పాటు చేసిందని.. 4 వారాల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించామని తెలిపారు. కమిటీల పేరుతో కాలయాపన చేస్తామనడం పొరపాటు అని స్పష్టం చేశారు.ఆర్టీసీ కార్మికులు లేవనెత్తిన 32 అంశాల్లో 29 అంశాలకు ప్రభుత్వం నుంచి ఎటువంటి వ్యతిరేకత లేదని పొన్నం ప్రభాకర్ తెలిపారు. అవన్నీ వెంటనే పరిష్కారమయ్యే అంశాలని పేర్కొన్నారు. ఆర్టీసీ విలీనం, గుర్తింపు సంఘాల ఎన్నికలు రెండు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ఈ రెండు అంశాల్లో పలు సాంకేతిక అంశాలు చరించాల్సి ఉందన్నారు. వీటిపై అధ్యయనం చేసేందుకే నాలుగు వారాల గడువు అడిగామని వివరించారు. ఈ రెండు అంశాలు కూడా సీఎం, డిప్యూటీ సీఎం దగ్గర చర్చిస్తామని అన్నారు. ఆర్టీసీ విలీనం ఆలస్యమైనప్పటికీ.. ఉద్యోగులకు ఒకటో తారీఖు జీతాలు వస్తున్నాయని పొన్నం ప్రభాకర్ తెలిపారు. గుర్తింపు సంఘాల ఎన్నికల విషయంలో నాయకుల మధ్య అంతర్యుద్ధం, నాయకత్వ అంశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆర్టీసీ ఇప్పుడిప్పుడే కోలుకుంటుందని.. అన్ని అంశాలను పరిష్కరిస్తామని చెప్పారు. మిమ్మల్ని ఎవరూ అడ్డుకోరని.. ప్రజాస్వామ్య పద్ధతిలో మీ నాయకులు నిరసన తెలపవచ్చని.. ప్రజలపై ఒత్తిడి తీసుకురావచ్చని అన్నారు. అయితే పేద ప్రజల ప్రయాణాలకు ఇబ్బంది కలగజేయవద్దని విజ్ఞప్తి చేశారు. మీ నాయకులు నిరసన తెలపవచ్చని.. మిగతా వారంతా విధుల్లో చేరి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చేయాలని కోరారు.



## హైకోర్టు తీర్పుతో బుద్ధి తెచ్చుకోవాలి

**కాంగ్రెస్‌కు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి హితవు**

**హైదారబాద్, ఏప్రిల్ 22 :** కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై హైకోర్టు తీర్పును చూసైనా కాంగ్రెస్ పార్టీ బుద్ధి తెచ్చుకోవాలని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ప్రాథమిక హక్కులు, సహజ న్యాయ సూత్రాలను విస్మరిస్తూ నడిపిన విచారణను ఉన్నత న్యాయస్థానం తప్పుబట్టింది. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ జీవధార కాళేశ్వరం మీద నిందలు మోపి బీఆర్‌ఎస్ , కేసీఆర్ ప్రతిష్ట దెబ్బ తీసేందుకు కాంగ్రెస్, బీజేపీ వాడుకున్నాయని ఆరోపించారు. ప్రాజెక్ట్‌ను రెండున్నరేళ్లు మరమ్మతులు చేపట్టకుండా అడ్డుకున్నారు. చివరకు గత్యంతరం లేక మరమ్మతులు చేపడుతున్నారు. కాళేశ్వరం విషయంలో కేసీఆర్ మీద చేసిన ఆరోపణలకు కాంగ్రెస్, బీజేపీ పార్టీలు తెలంగాణ ప్రజలకు, రైతాంగానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. హైకోర్టు తీర్పుపై ఆయన హర్షణీయం వ్యక్తం చేశారు.

## ఘోష్ కమిషన్‌ను పక్కన పెట్టిన హైకోర్టు

**న్యాయం గెలిచినట్లేనన్న పద్మాదేవేందర్**

**మెదక్, ఏప్రిల్ 22 :** కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తాజా తీర్పును మాజీ డిప్యూటీ స్పీకర్, మెదక్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు ఎం పద్మా దేవేందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశించడం న్యాయం గెలిచినట్టేనని ఆమె పేర్కొన్నారు. కమిషన్ విచారణలో ప్రాథమిక న్యాయ నిబంధనలు పాటించలేదని కోర్టు స్పష్టం చేయడం ద్వారా ఆ నివేదికకు చట్టపరమైన బలం లేదని తేలిందన్నారు. ముఖ్యంగా సెక్షన్ 8 కింద సంబంధిత వ్యక్తులకు ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఆరోపణలు చేయడం సరికాదని కోర్టు వ్యాఖ్యానించడం అత్యంత కీలక పరిణామమని తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావుపై రాజకీయ ఒత్తిడి తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కమిషన్లను అడ్డంపెట్టుకుని వేధింపులకు పాల్పడిందని ఆమె విమర్శించారు. న్యాయస్థానాలపై నమ్మకంతో పోరాడగా చివరకు నిజం గెలిచిందని పేర్కొన్నారు. తెలంగాణ జీవధారగా భావించే కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ పార్టీ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు ప్రతిష్టను దెబ్బతీయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కక్షపూరితంగా వ్యవహరించాయని ఆరోపించారు. ప్రాజెక్టు మరమ్మతులను సకాలంలో చేపట్టకుండా దాదాపు రెండున్నరేళ్లు ఆలస్యం చేశారని, గత్యంతరం లేక ఇప్పుడు పనులు ప్రారంభిస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం అంశంలో కేసీఆర్‌పై చేసిన ఆరోపణలు నిరాధారమని ఈ తీర్పుతో స్పష్టమైందని, కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ఈ తీర్పుతో కనువిప్పు కలగాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ వేధింపులను పక్కన పెట్టి పాలనపై దృష్టి సారించి, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆమె అన్నారు. న్యాయం ఎప్పటికైనా గెలుస్తుందనే విశ్వాసానికి ఈ హైకోర్టు తీర్పు నిదర్శనమని పద్మా దేవేందర్ రెడ్డి పేర్కొన్నారు.

## ఆర్టీసీ సమ్మెకు బిఆర్ఎస్ సంఘీభావం

**ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేని ప్రభుత్వం**

**హైదరాబాద్, ఏప్రిల్ 22 :** ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బీఆర్ఎస్ పార్టీ సంఘీభావం తెలిపుతుందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ గత కేసీఆర్ ప్రభుత్వంలోనే కేబినెట్ ఆమోదం తెలిపి, జీవో, గెజిట్ ఇచ్చామన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చెప్పిందే అమలు చేయమని ఆర్టీసీ కార్మికులు అడుగుతున్నారన్నారు.రెండున్నరేళ్లలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయలేకపోవడం వల్లే ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీకి రూ.3000 కోట్లు ప్రభుత్వం బకాయిలు పడింది. దీంతో ఆర్టీసీ ఉద్యోగులకు డీఏలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వలేకపోతుందని విమర్శించారు. కార్మికులతో చర్చలు జరిపి వారి న్యాయబద్ధమైన కోరికలు నెరవేర్చాలన్నారు. తక్షణమే మహాలక్ష్మి బకాయిలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

## కులాల మధ్య చిచ్చుతో రాజకీయ పబ్బం

**వైసిపి తీరుపై మండిపడ్డ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి**

**రాజమండ్రి, ఏప్రిల్ 22 :** రాష్ట్రంలో కులాల మధ్య విభేదాలు సృష్టించి.. రాజకీయ పబ్బం గడుపుకోవాలని వైసీపీ ప్రయత్నిస్తోందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆరోపించారు. 'కులాల మధ్య చిచ్చు పెడుతుంటే మేము చూస్తూ ఊరుకోం.. రాజకీయంగా పతనం కావడంతోనే జగన్ ఇలాంటి అరాచకాలకు తెరలేపారు' అని ఆయన విమర్శించారు. తనపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తీవ్రంగా ఖండించారు. కాపు సామాజిక వర్గాన్ని కించపరిచే ఉద్దేశం తనకు లేదని, తన వ్యాఖ్యలను బ్లూ మీడియా ఉద్దేశపూర్వకంగా వక్రీకరించిందని ఆయన మండిపడ్డారు. ఇప్పటికే సాక్షి పత్రికై బొమ్మూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ.. 'రాజమండ్రి రూరల్ నియోజకవర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పనిచేస్తున్నాం. అంబటి అయినా గింబటి అయినా ఎవరైనా తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదు. నా వ్యాఖ్యలను సాక్షి పత్రిక వక్రీకరించింది. జగన్ ఒక 'సూసైడ్ స్క్వాడ్'ను తయారు చేశారు. విచ్ఛిన్న శక్తులకు తాడేపల్లి ప్యాలెస్ కేంద్రంగా మారింది. దేవాలయాలు, వ్యక్తుల పైనా దాడులు చేయిస్తున్నారు. జక్కంపూడి రాజా లాంటి వాళ్ళను పిచ్చి ఆసుపత్రిలో చేర్చాలి. మాజీ ఎంపీ మార్గాని భరత్ రాజమండ్రి కంబాల చెరువు, దేవిచౌక్ ప్రాంతాలను అభివృద్ధి పేరుతో కంపుకొట్టించారు. కుర్రాళ్లు వాస్తవాలు తెలుసుకొని రాష్ట్ర భవిష్యత్తు గురించి మాట్లాడితే బాగుంటుంది. కూటమి ప్రభుత్వం సమన్వయంతో పని చేస్తోంది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఒకే ఆలోచనా విధానంతో ముందుకు వెళ్తున్నారు. సిగ్గులేకుండా ఇసుక గురించి మాట్లాడుతున్న వైసీపీ నేతలకు దమ్ముంటే అభివృద్ధిపై చర్చకు రావాలని సవాల్ విసురుతున్నా.' అని అన్నారు.

## మాజీ సిఎం నాదెండ్ల భాస్కర్ రావు మృతి

**చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిన నేత**
**మంత్రి కందుల దుర్గేశ్ తదితరుల సంతాపం**




**హైదరాబాద్, ఏప్రిల్ 22 :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు (90) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న భాస్కర్ రావు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. 1935 జూన్ 23న గుంటూరులో జన్మించిన నాదెండ్ల భాస్కర్ రావు 1978లో విజయవాడ ఈస్ట్ నుంచి పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1978 నుంచి 1989 వరకు ఎమ్మెల్యేగా కొనసాగారు. 1986 ఆగస్ట్ 16 నుంచి సెప్టెంబర్ 16 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా బాధ్యతలు నిర్వర్తించారు. అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌ను పదవీచ్యుతిడిని చేసిన నాదెండ్ల నెలరోజులపాటు సిఎంగా కొనసాగారు. నాదెండ్ల భాస్కర్ రావు మృతిపట్ల సినీ, రాజకీయ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నాదెండ్ల భాస్కర్ రావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ సంతాపం తెలియజేశారు. నాదెండ్ల భాస్కర్ రావు కుమారుడు నాదెండ్ల మనోహర్ ప్రస్తుతం జనసేన పార్టీ తరపున ఏపీ మంత్రిగా సేవలందిస్తున్నారని తెలిసిందే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం నాదెండ్ల భాస్కర రావు(90) కన్నుమూశారు. గత నెల రోజులుగా నాదెండ్ల భాస్కరావు మృతి పట్ల మంత్రి కందుల దుర్గేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'భాస్కరరావు మృతి రాజకీయ రంగానికి తీరని లోటు. ఎంతోమంది నేతలకు రాజకీయ ఓనమాలు నేర్పిన గొప్ప మార్గదర్శి నాదెండ్ల భాస్కర్ రావు. ప్రజా ప్రతినిధిగా భాస్కరరావు చేసిన సేవలు చిరస్మరణీ యం. 1980వ దశకంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంలో ఆయన కీలక పాత్ర పోషించారు. స్వల్పకాలం ముఖ్యమంత్రిగా పనిచేసినప్పటికీ, అంతకుముందు మంత్రిగా ఆయనకు పరిపాలనపై గట్టి పట్టు ఉండేది. చట్టసభల పనితీరుపై ఆయనకు అపారమైన అవగాహన ఉంది. గుంటూరు జిల్లా నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించి, రాష్ట్ర, జాతీయ స్థాయిలో తనదైన ముద్ర వేశారు' అని మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్ కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నాదెండ్ల భాస్కర్ రావు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.



# వర్గరహిత సమాజం కోసం ఐక్య పోరాటాలకు పిలుపు

**సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సబ్‌డివిజన్ కార్యదర్శి భూక్య శివ నాయక్**

**కారేపల్లి, నేడు న్యూస్ :** మండల పరిధిలోని పాత చన్నెగలగడ్డ గ్రామంలో మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కామ్రేడ్ లెనిన్ జయంతిని పురస్కరించుకొని సిపిఐ(ఎంఎల్) ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సబ్‌డివిజన్ కార్యదర్శి భూక్య శివ నాయక్ మాట్లాడుతూ, భూమి, భుక్తి, దేశ విముక్తి లక్ష్యంగా 1969లో రివిజనిస్టు, నయా రివిజనిస్టు శక్తులతో తగదింపులు జరిపి సిపిఐ(ఎంఎల్) ఆవిర్భవించిందన్నారు. ఆవిర్భవించిన నాటి నుండి నేటి వరకు సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో అనేక ప్రజా పోరాటాలు నిర్వహిస్తూ పేదలు, గిరిజనుల హక్కుల కోసం పోరాడుతున్నామని తెలిపారు. లక్షలాది ఎకరాల భూములను పేదలకు పంచిపెట్టడంలో, అనేక గ్రామాల నిర్మాణంలో తమ పాత్ర ఉందన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమాలు కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. దేశంలో ప్రస్తుతం బిజెపి ప్రభుత్వం మతోన్మాద, ఫాసిస్టు భావజాలంతో పనిచేస్తోందని, ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ప్రజాస్వామ్య హక్కులను అణచివేసే విధంగా నిర్బంధాలు కొనసాగుతున్నాయని అన్నారు. దళితులు, ఆదివాసీలు, గిరిజనులు, మైనారిటీలపై దాడులు పెరుగుతున్నాయని, దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాలు అమలు చేస్తున్నారని ఆరోపించారు. మరోవైపు సామ్రాజ్యవాద శక్తులు ప్రపంచ స్థాయిలో ఉద్రిక్తతలను పెంచుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో కూడా ప్రజా సంపద దోపిడీ జరుగుతోందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చలేక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వ భూముల కబ్జాలు, అవినీతి పెరుగుతున్నాయని అన్నారు. దేశంలో, రాష్ట్రంలో కొనసాగుతున్న దళారీ ప్రభుత్వాలను ఎదుర్కోవాలంటే విప్లవ శక్తులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. వర్గరహిత సమ సమాజ స్థాపన కోసం నూతన ప్రజాస్వామిక విప్లవమే మార్గమని స్పష్టం చేశారు. ప్రజలు స్వేచ్ఛా, సమానత్వంతో జీవించాలంటే మార్క్సిజం-లెనినిజం-మావో సిద్ధాంతాల ఆధారంగా సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.



# సింగరేణి మండలంలో అభివృద్ధి నీటి సమస్యలపై కీలక సమీక్ష

**కారేపల్లి, నేడు న్యూస్:** సింగరేణి మండలం అప్పయ్యగూడెం రైతు వేదికలో మండలానికి చెందిన 41 మంది సర్పంచులు, ఉపసర్పంచులు, సెక్రటరీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డిపిఓ తేజావత్ రాంబాబు అధ్యక్షత వహించగా, ఇరిగేషన్ ఈఈ పుష్పలత, డిఇ నరసింహారావు, ఏఈ నరేంద్ర, సింగరేణి మండల ఎంపీవో రవీంద్ర ప్రసాద్ పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ నిధులను సమర్థంగా వినియోగించే విధానం, రాబోయే వేసవి రెండు నెలల్లో చేపట్టాల్సిన పనులు, ముఖ్యంగా నీటి ఎద్దడిని అధిగమించే చర్యలపై అధికారులు వివరించారు. మండలంలోని పలు పంచాయతీల సమస్యలను సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు భూక్య రంజిత్ కుమార్, దిశా కమిటీ సభ్యురాలు ధరావత్ హేమలత బాలాజీ ఇతర సర్పంచులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా, వాటిని శ్రద్ధగా విని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కింద చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులను పది రోజుల్లోపు క్లియర్ చేయాలని ఎంపీవోకు సూచించారు. పెండింగ్ బిల్లులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఇదే సందర్భంలో వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజల దాహార్తి నివారణ కోసం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సమావేశం ద్వారా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం అవుతాయని సర్పంచులు తెలిపారు.



# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల కొరతతో రైతుల కష్టాలు

**కొండబోయిన నాగేశ్వరరావు**

**కారేపల్లి, నేడు న్యూస్:** మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు కొండబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే. నరేంద్ర ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం కారేపల్లి మండలం మాదారం గ్రామంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సీపీఐ(ఎం), రైతు సంఘం నాయకులు సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండలంలో సుమారు 10 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరిగినప్పటికీ ప్రభుత్వం కేవలం మాదారం గ్రామంలో ఒక్క కొనుగోలు కేంద్రాన్ని మాత్రమే ఏర్పాటు చేయడం అన్యాయమన్నారు. రేలకాయలపల్లి, చీమలపాడు, తొడితలగూడెం, పోలంపల్లి, కమలాపురం వంటి గ్రామాల రైతులు దూర ప్రాంతం నుండి మాదారం కేంద్రానికి పంట తీసుకురావాల్సి రావడంతో అదనపు ఖర్చులు భరించాల్సి వస్తోందన్నారు. ఈ సందర్భంగా వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌కు ఫోన్ ద్వారా పరిస్థితులను వివరించగా, అదనపు కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అలాగే ప్రస్తుత కొనుగోలు కేంద్రంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సీఈవో బొల్లు హనుమంతరావుకు సూచనలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు ముండ్ల ఏకాంబరం, కార్యదర్శి వజ్జా రామారావు, నాయకులు తుమోజు రామ్మూర్తి, పాపినేని నాగేశ్వరరావు, పొట్లకాయల రమేష్, జడల నాగేశ్వరరావు, రజిని, కిలారి అప్పారావు, బానోత్ సీతారాములు, ధర్మసోత్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక ఐక్యతకు వేదికగా కమ్యూనిటీ హాల్లు

- చర్లపల్లి డివిజన్‌లో ఇందిరమ్మ గృహకల్ప కాలనీలో రూ. 2 కోట్ల నిధులు మంజూరు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞ తెలిపిన బొంతు శ్రీదేవి యాదవ్



**చర్లపల్లి, నేడు న్యూస్:** కాలనీలలో సామాజిక ఐక్యత పెంపొందించడానికి కమ్యూనిటీ హాళ్లు వేదికలుగా మారుతాయని మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ అన్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఇందిరమ్మ గృహకల్ప కాలనీ(ఐజీకే) లో మల్టీ లెవెల్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ. 2 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. ఐజీకే సమీప కాలనీలలోని నిరుపేద ప్రజల అవసరాల కోసం మల్టీ లెవెల్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం ఈ భారీ నిధులు మంజూరు కావడం ఆ ప్రాంత ప్రజలకు పెద్ద ఊరట లభించింది. రూ. 2 కోట్ల భారీ వ్యయంతో ఈ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఐజీకే కాలనీ అభివృద్ధికి ఆనాటి ఈనాటి వరకు సహకరిస్తున్న నగర తొలి మేయర్ బొంతు రామ్మోహన్ కి కాలనీవాసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి ప్రజలు తమ ఇంట్లో జరిగే పెళ్లిళ్లు, శుభకార్యాలు, ఇతర సామాజిక కార్యక్రమాలను తక్కువ ఖర్చుతో జరుపుకోవడానికి మల్టీ లెవల్ ఫంక్షన్ హాల్‌ను నిర్మిస్తున్నామని వివరించారు. కాలనీవాసుల చిరకాల కోరిక ఈ ఫంక్షన్ హాల్ మంజూరు వెనుక కాలనీకి చెందిన ముఖ్య నాయకులు, ప్రజల సుదీర్ఘ పోరాటం ఉందన్నారు. ముఖ్యంగా గతంలో అధ్యక్షులుగా పనిచేసిన స్థానిక ప్రముఖులు దీని కోసం గట్టిగా కృషి చేశారని కొనియాడారు. కాలనీకి చెందిన ముత్యాలు, వెంకట్ రెడ్డి, వెంకట్ గౌడ్, నాసిర్, చక్రపాణి, శ్యామ్ ప్రసాద్, రుబీన్ రాజ్, సత్తెమ్మ, ఇతర కాలనీవాసుల సమిష్టి కృషితో ప్రభుత్వం ఈ నిధులను మంజూరు చేసిందని తెలిపారు. ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లలో అద్దెలు భరించలేని పేద ప్రజలకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మల్టీ లెవల్ నిర్మాణం కాబట్టి, ఒకే సమయంలో రెండు వేర్వేరు కార్యక్రమాలు లేదా పెద్ద ఎత్తున జనం వచ్చేలా ప్లాన్ చేసే అవకాశం ఉంటుందని వివరించారు.

# న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలి

- ఆర్టీసీ కార్మికుల న్యాయమైన కోరికలు పరిష్కారం అయ్యే వరకు సమ్మె
- తెలంగాణ మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ ఈ. అశ్వద్ధామ రెడ్డి




**మేడిపల్లి, నేడు న్యూస్:** ఆర్టీసీ కార్మికుల న్యాయమైన కోరికలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్వద్ధామ రెడ్డి కోరారు. ఆర్టీసీ జేఏసీ పిలుపుమేరకు చెంగిచెర్ల, ఉప్పల్ డిపో కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చెంగిచర్ల డిపో సమీపంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం ఆవరణలో కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల సమ్మెలో అశ్వద్ధామ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం చెంగిచెర్ల ఆర్టీసీ డిపో కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలనీ, యూనియన్లను పునరుద్ధరణ చేయాలనీ, 2021, 2025 వేతన సవరణ చేయాలనీ, 2017 వేతన సవరణ బకాయిలు చెల్లించాలని, రిటైర్ అయినవారికీ చెల్లించాల్సిన అన్ని బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఐకమత్యంతో సమ్మెను విజయవంతం చేసి డిమాండ్లు సాధించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీఎంయూ అధ్యక్షుడు శంకర్, ఎన్ఎంయు అధ్యక్షుడు కమాల్ రెడ్డి, చైర్మన్ చెన్నారెడ్డి, జనరల్ సెక్రటరీ నరేందర్, బీఆర్ఎస్కేవీ జనరల్ సెక్రటరీ రామావతారం, డిపో జేఏసీ చైర్మన్ కేబీ. నర్సింహా, అడిషనల్ చైర్మన్ సత్తయ్య, కన్వీనర్ రమేష్, కో-కన్వీనర్ రాజిరెడ్డి, కోశాధికారి సుల్తాన్ పాషా, సలహాదారు సోమయ్యతో పాటు డిపో ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఆర్టీసీ కార్మికుల డిమాండ్లు.. పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

**తెలంగాణ ఆర్టీసీ సమ్మెకు బీఆర్ఎస్ నేతల మద్దతు**



**పీర్జాదిగూడ, నేడు న్యూస్:** ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి అన్నారు. ఆర్టీసీ కార్మిక జేఏసీ సమ్మెకు పీర్జాదిగూడ బీఆర్ఎస్ పార్టీ సంఘీభావం ప్రకటించింది. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పీర్జాదిగూడ డివిజన్ పరిధిలోని ఉప్పల్ బస్ డిపో వద్ద ఆర్టీసీ కార్మికులకు సంఘీభావంగా మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ఆర్టీసీ సమస్యల పరిష్కారానికి పలు కీలక చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. సంస్థ బలోపేతానికి ఆర్థిక సహాయం అందించడం, ఉద్యోగుల జీతాల పెంపు, పెండింగ్ సమస్యల పరిష్కారం, కొత్త బస్సుల కొనుగోలు, డిపోల అభివృద్ధి వంటి చర్యలతో ఆర్టీసీని కాపాడారని తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తోందని వారు విమర్శించారు. వెంటనే ఆర్టీసీ ఉద్యోగులతో చర్చలు జరిపి, వారి డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, కౌడే పోచయ్య, సీనియర్ నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి, మహిళా అధ్యక్షురాలు నిర్మల, ఆకుల మధుకర్, కందుకూరి ఆంజనేయులు, బుల్లెట్ శంకర్, అశోక్ రెడ్డి, సతీష్, శ్రీరాములు గౌడ్, అశోక్, కిరణ్ నాయక్, పాశం నరేందర్ గౌడ్, శ్రీకాంత్, అమర్ పటేల్, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.




# లారీని ఢీకొన్న బైక్.. యువకుడు మృతి



**దేవరుప్పల నేడు న్యూస్:** దేవరుప్పుల మండలంలోని సీతారాంపురం గ్రామ సమీపంలోని చీఎ365దీ హైవేపై బుధవారం తెల్లవారుజామున సుమారు 2:45 గంటల సమయంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఒక లారీ మెకానికల్ లోపం కారణంగా హైవేపై నిలిపి ఉంచబడింది. అదే సమయంలో సూర్యాపేట నుండి జనగామ వైపు వెళ్తున్న పల్సర్ మోటార్ సైకిల్ ఆ లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఢీకొన్న వేగం తీవ్రంగా ఉండడంతో బైక్ నడుపుతున్న యువకుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడు ముత్యం మహేష్ వయసు (26) సంవత్సరాలు, తండ్రి సోమయ్య, యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందినవాడిగా గుర్తించారు. అతను తన అమ్మమ్మ ఊరైన తిరుమలగిరి నుండి తన స్వగ్రామమైన బ్రాహ్మణపల్లి వైపు పల్సర్ మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ఎంఎన్ఆర్ గార్డెన్ దాటి కొంత దూరం వెళ్లిన తర్వాత హైవేపై నిర్లక్ష్యంగా లారీని నిలిపివేయడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు తెలిపారు. ప్రమాదం విషయం తెలుసుకున్న వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఈ ఘటనపై మృతుడి అన్న ముత్యం గోపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు దేవరుప్పుల ఎస్సై సృజన్ కుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.

# మేడ్చల్ జిల్లాలో 25,492 మంది రైతులకు రైతు భరోసా విడుదల

**రూ.15.58 కోట్లు రైతుల ఖాతాలో జమ**



**మేడ్చల్, నేడు బ్యూరో :** మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో 25,392 మంది రైతులకు రైతు భరోసా పడింది. రూ.15.58 కోట్ల మేరకు ఇప్పటి వరకు రైతు భరోసా నేరుగా రైతుల ఖాతాలో జమైంది. ప్రస్తుతం రెండు ఎకరాల వరకు రైతు భరోసా విడుదలైంది. ఈ సీజన్ లోనే మొదటి దశలో ఒక ఎకరా వరకు భూమి ఉన్న రైతులకు రూ. 10.02 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం తాజాగా రెండు ఎకరాల వరకు భూమి ఉన్న రైతులకు రైతు భరోసాను విడుదల చేసింది. ఈ రెండు దశలు కలిపి ఇప్పటి వరకు మొత్తం రూ.15.58 కోట్ల మేరకు రైతు భరోసా పడినట్టు జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని చంద్రకళ వెల్లడించారు.



# గిరిజన హాస్టళ్ల తనిఖీ

**మేడ్చల్ నేడు బ్యూరో:** ప్రజా పాలనా - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా, సంక్షేమ వారం సందర్భంగా, ఈ నెల 22న జిల్లా లోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి, అసిస్టెంట్ ఇంజనీర్ లు ప్రభుత్వ గిరిజన సంక్షేమ వసతి గృహములను తనిఖీ చేశారు. అలాగే మరమ్మతు పనులను పరిశీలించారు. ఇందులో, సంబంధిత వసతి గృహ సంక్షేమ అధికారులు అసిస్టెంట్ ఇంజనీర్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి పాల్గొన్నారు. హాస్టళ్ల మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలని ఈ సందర్భంగా జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి పద్మజ అసిస్టెంట్ ఇంజనీర్ ను ఆదేశించారు.



# ఫీల్డ్ అసిస్టెంట్‌కు సన్మానం

**కారేపల్లి, నేడు న్యూస్:** పొలం పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని డిజిటల్ విధానంలో సమర్థవంతంగా అమలు చేసి, కూలీలకు పారదర్శకంగా మరియు సమయానికి వేతనాలు అందించడంలో రాష్ట్ర స్థాయిలో రెండో స్థానాన్ని సాధించిన ఫీల్డ్ అసిస్టెంట్ అజ్మీరా సంపత్ కుమార్‌ను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. గ్రామ అభివృద్ధి పనుల్లో ముందుండి ఉపాధి హామీ పథకాన్ని ఫలప్రదంగా అమలు చేయడంలో అజ్మీరా సంపత్ కుమార్ కీలక పాత్ర పోషించినట్లు గ్రామస్తులు తెలిపారు. కూలీలకు ఎటువంటి ఆలస్యం లేకుండా వేతనాలు అందేలా తీసుకున్న చర్యలు ఆదర్శంగా నిలిచాయని కొనియాడారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్త పథకాల అమలులో చురుకైన పాత్ర పోషిస్తున్న సర్పంచ్ హేమలత బాలాజీ ఖమ్మం జిల్లా దిశ కమిటీ సభ్యురాలు సేవలను గ్రామస్తులు ప్రత్యేకంగా ప్రశంసించారు. గ్రామ అభివృద్ధి దిశగా తీసుకుంటున్న చర్యలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ బి. కోటేశ్వరరావు, పీఏజీ వసంత్, మాజీ సర్పంచ్ గుగులోత్ సక్రు నాయక్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాజీ సర్పంచ్ ధరావత్ బద్రు పాల్గొన్నారు.




# సంత పన్నుల వసూళ్లలో సింగరేణి పంచాయతీకి గుర్తింపు

**సర్పంచ్ మేదరి టోనీ సత్కారం**

**కారేపల్లి, నేడు న్యూస్:** ఎండోమెంట్‌కు సంబంధించిన వారాంతపు సంత నుంచి గ్రామపంచాయతీకి రావలసిన పన్నులను సమర్థవంతంగా వసూలు చేసి ఆదాయాన్ని పెంచినందుకు సింగరేణి గ్రామపంచాయతీ సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ (టోనీ)కు జిల్లా స్థాయిలో గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా డీపీఓ తేజావత్ రాంబాబు బుధవారం ఆయనను శాలువాతో సత్కరించారు. ఉప సర్పంచ్ పెద్దమ్మ భాగ్యలక్ష్మి కూడా సన్మానం అందుకున్నారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ, సంత పన్నుల వసూళ్లలో పారదర్శకతతో పాటు క్రమబద్ధతను పాటిస్తూ పంచాయతీ ఆదాయాన్ని పెంచడం అభినందనీయమని పేర్కొన్నారు. స్థానిక వనరులను సమర్థంగా వినియోగించుకుంటూ ఆదాయాన్ని పెంచే విధానాలు ఇతర గ్రామపంచాయతీలకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. గ్రామాభివృద్ధి దిశగా పంచాయతీ నిధులను సక్రమంగా వినియోగించి ప్రజలకు అవసరమైన సౌకర్యాలను కల్పించాలని సూచించారు. సింగరేణి పంచాయతీలో చేపట్టిన ఈ చర్యలు గ్రామ ఆర్థిక స్థితిని బలోపేతం చేసే దిశగా కీలకంగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ మల్లెల రవీంద్ర ప్రసాద్, ఉసిరికాయలపల్లి సర్పంచ్ వరలక్ష్మి రాజు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎల్లంపేటలో 'అరుణ గోదాం'
# అక్రమ నిర్మాణం!

- నిబంధనలకు పాతర.. నిమ్మకు నీరెత్తినట్లు పురపాలక అధికారులు
- 40 ఫీట్ల రోడ్డు ఉండాలి.. కానీ ఉన్నది 25 ఫీట్లే!
- హెచ్ఎండీఏ అనుమతులు లేకున్నా రెండేళ్లుగా సాగుతున్న నిర్మాణం



ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలో అనుమతులు లేని అరుణ గోడౌన్ నిర్మాణం

**మేడ్చల్, నేడు న్యూస్ :** అధికార పార్టీ అండ ఉంటే చాలు.. చట్టాలు చుట్టాలుగా మారిపోతాయి, నిబంధనలు తుంగలో తొక్కబడతాయి అనడానికి ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలో వెలుస్తున్న 'అరుణ గోదాం' ఒక సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. ఎటువంటి అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా రెండేళ్లుగా ఇక్కడ నిర్మాణం సాగుతున్నా.. సంబంధిత అధికారులు కన్నెత్తి చూడకపోవడం వెనుక భారీ రాజకీయ ఒత్తిడి ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**ఎమ్మెల్యే 'మిత్ర ధర్మం'.. ప్రభుత్వానికి ఆదాయ గండి! :**

విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఈ అక్రమ నిర్మాణానికి ఉత్తర తెలంగాణకు చెందిన ఒక అధికార పార్టీ ఎమ్మెల్యే (ప్రస్తుత డీసీసీ అధ్యక్షుడు) పూర్తి స్థాయిలో సహకరిస్తున్నట్లు తెలుస్తోంది. సదరు గోదాం యజమాని తన మిత్రుడని, అతనికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని ఎమ్మెల్యే నేరుగా పురపాలక అధికారులకు ఫోన్ చేసి ఒత్తిడి




బఫర్ జోన్‌లో పరిధిలో ఉన్న అరుణ గోడౌన్ నిర్మాణం

చేస్తున్నట్లు సమాచారం. ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ప్రజా ప్రతినిధి, నిబంధనలను అతిక్రమించి అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

**రూల్స్ ఏం చెబుతున్నాయి ? :**

గోదాముల నిర్మాణానికి కనీసం 40 అడుగుల రోడ్డు ఉండాలనేది హెచ్ఎండీఏ నిబంధన. కానీ, అరుణ గోదాం వద్ద కేవలం 25 అడుగుల రోడ్డుమాత్రమే ఉంది. ఈ సాంకేతిక కారణంతోనే పై స్థాయి అధికారులు దీనికి అనుమతులు నిరాకరించారు. అయితే, పురపాలక అధికారుల ఆశీస్సులతో.. "ముందు గోదాం నిర్మించేయండి.. తర్వాత చూసుకుందాం" అనే ధీమాతో పనులు చకచకా సాగిపోతున్నాయి.

**అధికారుల ఉదాసీనత.. ముడుపుల మాయాజాలం? :**

సామాన్యుడు చిన్న ఇల్లు కట్టుకుంటే జరిమానాలు వేసే అధికారులు, ఇంత పెద్ద భారీ గోదాం అనుమతులు లేకుండా నిర్మిస్తున్నా ఎందుకు మౌనంగా ఉన్నారనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. గతంలో పంచాయతీ అధికారులు, ప్రస్తుతం పురపాలక శాఖ అధికారులు భారీగా ముడుపులు తీసుకున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. పేదల ఇళ్లను కూల్చివేసే పురపాలక యంత్రాంగం, ఎమ్మెల్యే మనుషుల విషయంలో మాత్రం "గాంధీ గారి కోతుల" తరహాలో వ్యవహరిస్తోంది.

**ఆందోళనలో స్థానికులు.. కలెక్టర్ జోక్యం కోరుతూ వినతి :**

గోదాం వల్ల భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్యలు, ఇతర ఇబ్బందులు ఎదురవుతాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పలుమార్లు పురపాలక కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని, ఎమ్మెల్యే ఒత్తిడి కారణంగానే అధికారులు వెనుకడుగు వేస్తున్నారని వారు మండిపడుతున్నారు.

**ప్రజా పాలనపై నమ్మకం కలగాలంటే..:**

తెలంగాణలో 'ప్రజా పాలన' సాగుతోందని ప్రభుత్వం చెబుతున్న తరుణంలో, ఇలాంటి అక్రమ కట్టడాలు ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చుతున్నాయి. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని అరుణ గోదాం నిర్మాణాన్ని నిలిపివేయడంతో పాటు, బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎల్లంపేట పురపాలక ప్రజలు విన్నవిస్తున్నారు. లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు.



## ఇనుముల లక్ష్మీ కుటుంబ సభ్యులను పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు

**దేవరుప్పుల, నేడు న్యూస్ :** దేవరుప్పుల మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఇనుముల నాగరాజు మాతృమూర్తి ఇనుముల లక్ష్మి ఈరోజు ఉదయం మరణించగా పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి,టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమండ్ల ఝాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు వారి ఇంటికి వెళ్ళి వారి భౌతిక దేహాన్ని సందర్శించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు,కొడకండ్ల మార్కెట్ చైర్మన్ నల్ల ఆండాలు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుడు కాసారపు ధర్మారెడ్డి,బిసి సెల్ అధ్యక్షుడు కాడబోయిన గణేష్, మండల యూత్ అధ్యక్షుడు పులిగిల్ల వెంకన్న, మండల నాయకులు రెడ్డి రాజుల రమేష్,నల్ల సత్యనారాయణ, కాడబోయిన వెంకన్న,ధరావత్ రాజేందర్,గుగులోత్ నరేందర్,కౌడగాని నర్సింగ రావు, లొడంగి అశోక్,పులిగిల్ల అఖిల్,కాంగ్రెస్ పార్టీ నాయకులు,యువజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## సాంకేతిక విద్యకు ప్రోత్సాహం

**ఎంపీపీఎస్ పాఠశాలకు ఇన్ఫోసిస్ ఫౌండేషన్ కంప్యూటర్ సహాయం**

**దేవరుప్పుల నేడు న్యూస్ :** దేవరుప్పుల మండలకేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఇన్ఫోసిస్ ఫౌండేషన్ వారు ఒక డెస్క్‌టాప్ కంప్యూటర్‌ను అందజేశారు.గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే సాంకేతిక విద్యను చేరువ చేయాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టడం జరిగింది.ఈ వితరణకు ప్రత్యేక కృషి చేసిన ఇన్ఫోసిస్ ప్రాజెక్ట్ మేనేజర్ రాపాక స్వాతికి, కోఆర్డినేటర్ రాపాక నాగరాజుకి పాఠశాల యాజమాన్యం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాగి స్వప్న,ఉపాధ్యాయులు పేటల చంద్రశేఖర్,దరావత్ వెంకటేష్,భూక్యా శారద పాల్గొన్నారు.వారితో పాటుగా ఈ సేవా కార్యక్రమానికి సహకరించిన వనమాల శ్రీనివాస్ గారికి కూడా పాఠశాల సిబ్బంది,గ్రామస్తులు,విద్యార్థుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.విద్యాభివృద్ధికి ఇన్ఫోసిస్ ఫౌండేషన్ అందిస్తున్న ఈ సహకారం ఎంతో అభినందనీయమని వారు కొనియాడారు.




## ఆర్టీసీ కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి

**ఉప్పల్ డిపో ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా సిపిఐ పార్టీ నాయకులు**

**పీర్జాదిగూడ, నేడు న్యూస్:** ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మేడిపల్లి మండల సిపిఐ కార్యదర్శి రచ్చ కిషన్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్మికులు చేస్తున్న సమ్మెకు మద్దతుగా బుధవారం మేడిపల్లి మండల సిపిఐ పార్టీ కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ జేఏసీకి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రచ్చ కిషన్ మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. 2021 వేతన సవరణ 30 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు, ప్రభుత్వ ఉద్యోగులతో సమానత, పెండింగ్ బకాయిలు, పదవీ విరమణ ప్రయోజనాల చెల్లింపు, డ్రైవర్లు, కండక్టర్ల ఔట్‌సోర్సింగ్ నిలిపివేత, 2019 సమ్మె కేసుల ఉపసంహరణ, సస్పెండ్ అయిన కార్మికుల పునఃస్థాపన, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం అనే కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. కార్మికుల డిమాండ్లు నెరవేరేవరకు సిపిఐ పార్టీ వెన్నంటే ఉండి సమ్మెలో మద్దతుగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, ఏఐటీయూసీ డిప్యూటీ కార్యదర్శి దండు రమేష్, సిపిఐ పార్టీ మండల కార్యదర్శి సిహెచ్. మాధవి, బీసీ సంఘం జిల్లా నాయకురాలు కే. ప్రమీల, బికేయంయు మండల కార్యదర్శి, అధ్యక్షులు కే. మహాలక్ష్మి, భూతం ఐలయ్య, మండల కౌన్సిల్ సభ్యురాలు ఏ. రమాతార, సిపిఐ పార్టీ నాయకులు గణేష్, ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.



## దాదాసాహెబ్ కాలనీలో అక్రమ ఇసుకపై అధికారుల హెచ్చరిక

**దేవరుప్పుల, నేడు న్యూస్:** దేవరుప్పుల మండలంలోని దాదాసాహెబ్ కాలనీలో అక్రమ ఇసుక తవ్వకాలను అరికట్టేందుకు మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ కాసర్ల రాజు ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ బృందం తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా ఇసుక ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లతో సమావేశమై ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుక కొట్టరాదని అధికారులు స్పష్టం చేశారు. ప్రభుత్వం నిబంధనలు ఉల్లంఘిస్తూ అక్రమ ఇసుక తవ్వకాలు లేదా రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్ సభ్యులు అంబాల శ్రీధర్ గౌడ్, వెంకటేష్, పాశం యాకన్న, అజీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్, డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలి

- ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలి
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్



**మేడిపల్లి, నేడు న్యూస్:** ఆర్టీసీ కార్మికుల రాష్ట్ర వ్యాప్త సమ్మెతో ఏర్పడ్డ ఇబ్బందుల దృష్ట్యా ఇంజనీరింగ్, డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఉప్పల్ డిపో వద్ద ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెకు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ సంఘీభావం తెలియజేశారు. అనంతరం పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని చేస్తున్న సమ్మెకు ఏఐఎస్ఎఫ్ మద్దతు ఇస్తుందని, ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా బుధవారం నుండి ఆర్టీసీ కార్మికులు సమ్మె చేయడం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితం అయ్యాయని, సమ్మె ప్రారంభం వల్ల ఇంజనీరింగ్, డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు బస్సులు లేక చాలా ఇబ్బందులు పడి సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకోలేకపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలకు ఉచిత బస్ నేపథ్యంలో ప్రతి విద్యార్థిని ఆర్టీసీ బస్సులోనే ప్రయాణిస్తు కళాశాలలకు వస్తున్నారని, అదేవిధంగా విద్యార్థులు ఆర్టీసీ బస్ పాస్ ల ద్వారా మారుమూల ప్రాంతాలు, పల్లెటూరుల నుండి కళాశాలలకు వస్తున్నారని, అధికంగా విద్యార్థులు ఆర్టీసీ బస్సులు ఉపయోగిస్తున్నారని, అలాంటప్పుడు పరీక్షల సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నత విద్యాశాఖ, జేఎన్టీయూ అధికారులు వెంటనే విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా సెమిస్టర్ పరీక్షలను సమ్మె విరమణ అయ్యే వరకు తాత్కాలికంగా వాయిదా వేయాలని, విద్యార్థుల భవిష్యత్ కి ఇబ్బంది లేకుండా అధికారులు ఆలోచించాలని, అదేవిధంగా రేపటి నుండి పాఠశాలలకు కూడా సెలవులు నేపథ్యంలో సంక్షేమ హాస్టల్, గురుకులాల్లో ఉండే విద్యార్థులు ఇంటికి వెళ్లడానికి కూడా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉంటుందని అన్నారు. ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల 32 న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, గతంలో రేవంత్ రెడ్డి ప్రతిపక్ష హోదాలో ఉన్నప్పుడు తమ అధికారంలోకి వస్తే ఆర్టీసీ కార్మికుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని, ఆర్టీసీలో గుర్తింపు సంఘాల ఎన్నికల నిర్వహిస్తామని ఇంకా అనేక హామీలు ఇచ్చి ఇప్పటికీ అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు కావస్తున్నా కమిటీలు వేసి కాలయాపన చేస్తున్నారు తప్ప ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో విఫలం చెందారని మండిపడ్డారు. ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్య ధోరణిని ఖండిస్తూ ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తున్నారని, వెంటనే ప్రభుత్వం వారి డిమాండ్లను పరిష్కరించాలని పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

## ఘనంగా ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయురాలు లక్ష్మి పదవి విరమణ కార్యక్రమం




**మేడ్చల్, నేడు న్యూస్ :** ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరంగవరం గ్రామంలో ఉన్న జెడ్పీహెచ్ ఎస్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న అవంగపురం లక్ష్మిదేవి పదవీ విరమణ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పీఆర్ టీయూ రాష్ట్ర అధ్యక్షులు పులగం దామోదర్ రెడ్డి,పీఆర్ టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి బిక్షం గౌడ్,పీఆర్ టీయూ జిల్లా అధ్యక్షులు రామేశ్వర్ గౌడ్,జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీదేవి,వైస్ చైర్ పర్సన్ మేకల రజితదేవేందర్ రెడ్డిలు హాజరయ్యారు.ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ అవంగపురం లక్ష్మిదేవి వ్యాయమ ఉపాధ్యాయురాలుగా పూడూరు,జీడిమెట్ల, శ్రీరంగవరం గ్రామాల్లోని జడ్పీహెచ్ఎస్ స్కూల్లో వ్యాయామ ఉపాధ్యాయురాలుగా పనిచేశారని గుర్తు చేశారు.అదేవిధంగా ప్రతి ఉద్యోగికి పదవి విరమణ తప్పనిసరని తెలిపారు.వ్యాయామ ఉపాధ్యాయురాలుగా పని చేస్తూ క్రీడల్లో ఎంతో మంది విద్యార్థులను జిల్లా,రాష్ట్ర స్థాయిలో ఎంపికయేందుకు కృషి చేశారని తెలిపారు.విద్యార్థులను శారీకంగా, మానసికంగా తయారు చేయడంలో వ్యాయామ ఉపాధ్యాయురాలు లక్ష్మిదేవి కీలక పాత్ర పోషించారని కొనియాడారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులు,పూర్వ విద్యార్థులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పీఆర్ టీయూ మండల అధ్యక్షులు మధు సూదన్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి రజిత,హెచ్ ఎం రాజశేఖర్, కౌన్సిలర్లు ఓం ప్రకాష్ గౌడ్,దాది నర్సింహా,చిన్నోళ్ల భాస్కర్, సద్ది సురేష్ రెడ్డి,పూర్వ విద్యార్థులు మాజీ సర్పంచ్ బాబు యాదవ్,శ్రీకాంత్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు సైతం వడ్డీ లేని రుణాలివ్వాలి


**జిల్లా రైతు సమాఖ్య డిమాండ్**

**మేడ్చల్, నేడు బ్యూరో:** స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఇస్తున్న తరహాలోనే రైతులకు కూడా వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలని జిల్లా రైతు సమాఖ్య ప్రభుత్వాన్ని కోరింది. జిల్లా రైతు సమాఖ్య మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కమిటి బుధవారం ఏప్రిల్ 22 న కలెక్టరేట్ లోని జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో సమావేశమైంది. ఈ సమావేశానికి జిల్లా రైతు సమాఖ్య అధ్యక్షులు ముద్దం సంజీవ రెడ్డి అధ్యక్షత వహించారు. జిల్లాలో రైతులు ఎదుర్కుంటున్న సమస్యలను రైతు సమాఖ్య ఈ సమావేశంలో చర్చించింది. ఈ సమస్యలను జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లాలని నిర్ణయం తీసుకుంది. ఈ సమస్యల్లో కొన్ని ఈ విధంగా ఉన్నాయి.

1. భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో రైతులు చేసుకున్న అర్జీలను వెంటనే పరిష్కరించాలి.
2. మహిళా సంఘాలకు ఏ విధంగానైతే వడ్డీ లేని రుణాలు ఇస్తున్నారో అలాగే రైతులకు కూడా వడ్డీలేని రుణాలు ఇవ్వాలి
3. పొలాల మధ్యలో నుంచి విద్యుత్ స్తంభాలు, 25 కేవీ విద్యుత్ లైన్లు వేయడం వల్ల రైతులు కరెంట్ షాక్ లు కొట్టి మృతి చెందుతున్నందున వాటిని వెంటనే మార్చాలి.
4. రెండు లక్షల లోపు రుణాలు తీసుకున్న వారందరికీ రుణమాఫీ చేయాలి.
5. సాధాబైనామాల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు, కొత్త రైతులకు అవకాశం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ను కలవాలని సమావేశం ఈ సందర్భంగా తీర్మానించింది.
6. ఎఫ్.పి.ఓ రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి, నాబార్డ్ ద్వారా రుణాలు ఇప్పించి బలోపేతం చేయాలి
7. జిల్లాలోని ఉద్దమర్రి రైతు సంఘం వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా వచ్చే కమిషన్ ను ఆ సంఘానికే చెందే విధంగా చర్యలు తీసుకోవాలని రైతు సమాఖ్య ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరింది. ఈ సమావేశంలో రైతు సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథం, గౌరవ అధ్యక్షులు పెంటా రెడ్డి, ఉపాధ్యక్షులు సింగం ఆంజనేయులు, సుధాకర్ నాయక్, ఎర్ర సత్యనారాయణ, ట్రెజరర్ సంఘీశెట్టి ఆంజనేయులు, సహాయ కార్యదర్శులు ఎడ్ల సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇప్పట్లో చర్చలు లేనట్లే..

### జేడీ వాన్స్ బృందం పాక్ పర్యటన వాయిదా..



**వాషింగ్టన్ :** అమెరికా– ఇరాన్ మధ్య ఇప్పట్లో చర్చలు జరిగే సూచనలు కన్పించట్లేదు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ బృందం పాకిస్థాన్ పర్యటన వాయిదా పడినట్లు తెలుస్తోంది. సంప్రదింపులకు సంబంధించి ఇరాన్ నుంచి స్పష్టమైన సమాచారం లేకపోవడంతోనే ఈ పరిణామం చోటుచేసుకున్నట్లు సమాచారం. వైట్‌హౌస్ వర్గాలను ఉటంకిస్తూ మీడియాలో ఈ మేరకు కథనా లు వెలువడుతున్నాయి. అమెరికా– ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం మ–ుగియడానికి ముందే.. చర్చల కోసం జేడీ వాన్స్ బృందం ఇస్లామాబాద్‌కు వెళ్లాల్సిఉంది. అయితే, చర్చలకు సంబంధించి ఇరాన్ నుంచి ఎలాంటి స్పష్టమైన ప్రకటన వెలువడలేదు. మరోవైపు తమ నౌకలపై విధించిన దిగ్బంధనం ఎత్తివేస్తేనే చర్చలకు వస్తామని ఇరాన్ గతంలో తేల్చిచెప్పింది. ఈ క్రమంలోనే వాన్స్ నేతృత్వంలోని బృందం పాక్ పర్యటన వాయిదా పడినట్లు వైట్‌హౌస్ వర్గాలు తెలిపాయి. అయితే, ఇది పూర్తిగా రద్దు కాలేదని, కేవలం వాయిదా మాత్రమేనని స్పష్టంచేశాయి. వాన్స్ బృందం ఎప్పుడైనా పాక్ పర్యటనకు బయలుదేరవచ్చని వెల్లడించాయి. ఇస్లామాబాద్‌కు తమ ప్రతినిధి బృందాన్ని పంపాలా, వద్దా అనే దానిపై తాము ఇంకా నిర్ణయం తీసుకోలేదని ఇరాన్ విదేశాంగ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి పేర్కొన్నారు. ఈ సందర్భంగా హర్మూజ్‌లో అమెరికా దిగ్బంధనం, వాణిజ్య నౌకను స్వాధీనం చేసుకోవడం గురించి ఆయన ప్రస్తావించారు. ఈ చర్యల కారణంగా చర్చల్లో వాషింగ్టన్ చిత్తశుద్ధిపై ఆయన అనుమానం వ్యక్తంచేశారు. మరోవైపు.. ఇరాన్‌తో కుదిరిన కాల్పుల విరమణను పొడిగి స్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఒక ప్రణాళికతో ఆ దేశం ముందు కువచ్చేవరకు ఇది కొనసాగుతోందన్నారు. అయితే, హర్మూజ్ వద్ద తమ దిగ్బంధనం మాత్రం కొనసాగుతోందని స్పష్టం చేశారు.



## ఆర్థికంగా కుదేలవుతున్న ఇరాన్

### రోజుకు సుమారు 500 మిలియన్ల డాలర్లు నష్టం

**వాషింగ్టన్, ఏప్రిల్ 22 :** ఇరాన్ ఆర్థికంగా కుదేలవుతున్నట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. హోర్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఇరాన్ ఆదాయం పడిపోతున్నట్లు ఆచయన చెప్పారు. హోర్ముజ్‌ను తక్షణమే ఓపెన్ చేయాలని ఇరాన్ భావిస్తున్నదని, ఎందుకంటే వాళ్లకు నగదు కొరత ఏర్పడిందన్నారు. ప్రతి రోజూ ఆ దేశం సుమారు 500 మిలియన్ల డాలర్లు నష్టపోతున్నదని ట్రంప్ తెలిపారు. మిలిటరీకి, పోలీసులకు జీతాలు అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నట్లు ట్రంప్ చెప్పారు. హోర్ముజ్‌ను మూసిన ఇరాన్ ఆ పరిస్థితి నుంచి బయటపడేందుకు ఇబ్బందిపడుతున్నట్లు ఆయన తెలిపారు. జలసంధిని బ్లాకేడ్ చేసినట్లు తాము చెప్పడం వల్లే ఇరాన్ దాన్ని మూయాలని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. వాస్తవానికి నాలుగు రోజుల క్రితం తన వద్దకు కొందరు వచ్చి హోర్ముజ్‌ను ఓపెన్ చేయాలని కోరారని, కానీ ఒకవేళ హోర్ముజ్‌ను తాము ఓపెన్ చేస్తే, అప్పుడు ఇరాన్‌తో డీల్ కుదు–ర్చుకోలేమన్నారు. ఒకవేళ ఆ దేశాన్ని మొత్తం పేల్చివేస్తే తప్ప మళ్లీ ఆ డీల్ కుదిరే అవకాశం ఉండదని ట్రంప్ అన్నారు.



## చమురే ఖర్గ్ ద్వీపాన్ని ముంచేస్తుంది

### అమెరికా మంత్రి హెచ్చరికలు

**వాషింగ్టన్ :** ఇరాన్ మెడలు వంచి.. దాన్ని ఎలాగైనా ఒప్పందంలోకి తీసుకురావాలని అమెరికా గట్టిగా ప్రయత్నిస్తోంది. దాన్ని ఆర్థికంగా మరింత ఇబ్బందిపెట్టేందుకు.. హర్మూజ్ దిగ్బంధనాన్ని కొనసాగిస్తోంది. దానిని ఉద్దేశించి అమెరికా ఆర్థికశాఖ మంత్రి స్కాట్ బెసెంట్ కీలక వ్యాఖ్యలు చేశారు. దిగ్బంధనంతో ఇరాన్ చమురు ఎగుమతులు ఆగిపోయి.. ఖర్గ్ ద్వీపం నిల్వలతో నిండిపోతుందన్నారు. పర్షియన్ గల్ఫ్‌లో ఒక చిన్న ద్వీపమైన ఈ ఖర్గ్.. ఇరాన్ చమురు ఎగుమతులకు అత్యంత కీలకమైనది. ఇక్కడినుంచే దాదాపు 90 శాతం ఎగుమతులను ఇరాన్ నిర్వహిస్తోంది. ఈ దిగ్బంధనం నేపథ్యంలో ఆ దేశ చమురు ఎగుమతులకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. దీనిపై బెసెంట్ 'ఎక్స్'లో ఓ పోస్టు పెట్టారు. 'ఇరాన్ ఓడరేవులపై యూఎస్ దిగ్బంధనం కొనసాగుతోందని అధ్యక్షుడు ట్రంప్ స్పష్టంచేశారు. దీంతో కొన్ని రోజుల్లోనే ఖర్గ్ ద్వీపంలోని చమురు స్టోరేజీ ట్యాంకులు నిండిపోతాయి. కీలకమైన ఇరాన్ చమురు బావులు మూతపడతాయి. దీంతో ఆ దేశ ప్రధాన ఆదాయానికి గండి పడనుంది' అని రాసుకొచ్చారు. ఈ సందర్భంగా టెహ్రాన్ ఆర్థిక సామ ర్థ్యాన్ని దెబ్బతీసేందుకు యూఎస్ ట్రెజరీ అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. ఇరాన్‌తో రహస్య వాణిజ్య, ఆర్థిక కార్యకలాపాలు సాగించే వ్యక్తులు, నౌకలు యూఎస్ ఆంక్షలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇరాన్ ఆర్థికవ్యవస్థపై ట్రంప్ కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. అది ఆర్థికంగా కుప్పకూలుతోందన్నారు. నగదు కొరతతో టెహ్రాన్ అల్లాడిపోతోందంటూ ట్రూత్‌లో ఓ పోస్టు పెట్టారు. తమ దిగ్బంధనంతో రోజుకి 500 మిలియన్ డాలర్లు ఇరాన్ కోల్పోతోందని.. దీంతో హర్మూజ్ జలసంధిని అది తెరవాలనుకుంటుందని పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా తమకు జీతాలు అందడం లేదంటూ ఇరాన్ సైన్యం, పోలీసులు ఫిర్యాదులు చేస్తున్నారని వ్యాఖ్యానించారు.

## కాల్పుల విరమణ

# పొడిగించిన ట్రంప్

- స్పష్టమైన ప్రతిపాదనతో రావాలని ఇరాన్‌కు సూచన
- ట్రూత్ సోషల్ మీడియాలో వెల్లడించిన అధ్యక్షుడు



**వాషింగ్టన్, ఏప్రిల్ 22 :** ఇరాన్‌తో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇరుదేశాల మధ్య గతంలో కుదిరిన కాల్పుల విరమణను పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. ఇరాన్ నాయకత్వం ఒక సమగ్ర ప్రతిపాదనను సమర్పించే వరకు ఈ కాల్పుల విరమణ కొనసాగుతుందని తెలిపారు. అమెరికా, ఇరాన్ మధ్య ఈ నెల 8వ తేదీన కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. రెండు వారాల ఈ సీజ్ ఫైర్ మరో కొద్ది గంటల్లో ముగియనుందనగా ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. అయ–ితే, పాకిస్థాన్ నుంచి వచ్చిన అభ్యర్థన మేరకే కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించినట్లుగా ట్రంప్ తెలిపారు. ముఖ్యంగా పాక్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్, ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ల అభ్యర్థన మేరకు సైనిక చర్యను వాయిదా వేసి, దౌత్య చర్చలకు అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లుగా పేర్కొన్నారు. ఈ మేరకు తన ట్రూత్ సోషల్ ఖాతా ద్వారా వివరాలను వెల్లడించారు. అయితే, సీజ్ ÷ర్ కొనసాగుతున్న సమయంలోనే ఇరాన్‌పై సముద్ర దిగ్బంధనాన్ని కొనసాగించాలని సైన్యానికి ఆదేశాలు ఇచ్చినట్లుగా ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ ప్రభుత్వంలో అంతర్గత విభేదాలు తీవ్రంగా ఉన్నాయి. అలాంటి పరిస్థితుల్లో వారు ఏకీకృత ప్రతిపాదనతో రావడానికి సమయం అవసరం. అందుకే ఈ దాడిని నిలిపివేసి, సీజ్ పొడిగించాం అని తెలిపారు. బ్లాకేడ్ కొనసాగించాలని ట్రంప్ తీసుకున్న నిర్ణయంపై ఇరాన్ మండిపడింది. ఇది కాల్పుల విరమణకు వ్యతిరేకమని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అర్ఘాచీ విమర్శించారు. వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడమంటే యుద్ధ చర్యే అని సమానమని అన్నారు. తమ ప్రయోజనాలను రక్షించుకోవడం ఇరాన్‌కు తెలుసని స్పష్టం చేశారు. ఇక పాక్‌లో జరగాల్సిన చర్చలకు హాజరుకాకూడదని ఇరాన్ నిర్ణయించుకున్నట్లుగా టస్నీమ్ వార్త సంస్థ వెల్లడించింది. అమెరికా అతిగా డిమాండ్లు చేస్తుందని.. అవి ఒప్పందానికి అడ్డుగా మారుతున్నాయి కాబట్టి చర్చల్లో పాల్గొనడం వ్యర్థమని అభిప్రాయపడుతున్నట్లుగా పేర్కొంది. ఇదిలావుంటే ఇరాన్‌తో ప్రస్తుతం కొనసాగుతున్న కాల్పుల విరమణ ఒప్పందంపై అమెరికా ఒక హెచ్చరిక జారీ చేసింది. ఈ కాల్పుల విరమణ అనేది 'అపరిమిత కాలం' కోసం కాదని, ఇరాన్ తన బాధ్యతలను నెరవేర్చడానికి ఒక నిర్దిష్ట సమయం మాత్రమే కేటాయించామని అమెరికా ఉన్నతాధికారి ఒకరు స్పష్టం చేశారు. ఈ అంశం గురించి సదరు అధికారి 'యాక్సియోస్' పత్రికతో మాట్లాడుతూ, ఇరాన్ నిబంధనలను పాటించకపోతే ప్రస్తుతం ఉన్న కాల్పుల విరమణను ఎప్పుడైనా రద్దు చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఉద్రిక్తతలను తగ్గించడానికి ఇరాన్‌కు ఒక అవకాశం ఇచ్చామని, అయితే దీనిని ఆ దేశం బలహీనతగా భావించకూడదన్నారు. అణ్వాయుధ కార్యక్రమాలు, ప్రాంతీయ ఉగ్రవాద సంస్థలకు మద్దతు లేదా ఇతర దౌత్యపరమైన అంశాలపై ఇరాన్ నుంచి ఆశించిన మార్పులు రాకపోతే తదుపరి చర్యలు ఉంటాయని తేల్చిచెప్పారు. పశ్చిమాసియాలో నెలకొన్న అస్థిరతను అరికట్టడానికి అంతర్జాతీయ సమాజం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ఈ కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. అయితే, ఇరాన్ తన ప్రాక్సీ గ్రూపుల ద్వారా లేదా నేరుగా వివాదాల్లో జోక్యం చేసుకుంటే సహించేది లేదని అమెరికా పదేపదే చెబుతోంది.

## హర్మూజ్ జలసంధిలో..

# నౌకలపై ఇరాన్ దాడి



**ఇరాన్ :** అమెరికా–ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం పొడిగించిన కొన్ని గంటలకే కీలక పరిణామం చోటుచేసు కొంది. హర్మూజ్ జలసంధిలో రెండు నౌకలపై ఇరాన్ దాడి చేసింది. ఈ దాడిలో ఓ కంటైనర్ నౌక దెబ్బతిన్నట్లు తెలు స్తోంది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కోర్ హర్మూజ్ జలసంధిలో ఓ కంటైనర్ నౌకపై కాల్పులకు పాల్పడిందని యూకే మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ సెంటర్ పేర్కొంది. కాల్పులకు ముందు గన్‌బోట్ నౌకకు ఎలాంటి హెచ్చరికలు చేయలేదని తెలిపింది. కాల్పుల్లో నౌకకు నష్టం వాటిల్లిందని, ఇందులో ఎవరికీ గాయాలు కాలేదని స్పష్టంచేసింది. ఈ ఘటన జరిగిన కొద్ది సేపటికే.. ఒక రవాణా నౌకపై కూడా ఇరాన్ కాల్పులు జరిపిందని పేర్కొంది. ఈ ఘటనలో సిబ్బంది అందరూ సురక్షితంగా ఉన్నారని, నౌకకు కూడా ఎలాంటి నష్టం జరగలేదని పేర్కొంది. కంటైనర్ నౌకపై దాడిని ఇరాన్ మీడియా కూడా ధ్రువీకరించింది. టెహ్రాన్‌కు చెందిన వాణిజ్య నౌకను అమెరికా దళాలు ఇటీవల స్వాధీనం చేసుకొన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఈ దాడి జరగడం ఉద్రిక్తతలను మరోసారి తీవ్రతరం చేసింది.

### అలా చేస్తే.. చర్చలకు సిద్ధం : ఇరాన్

అమెరికా– ఇరాన్ మధ్య చర్చలపై సందిగ్ధం వీడలేదు. ఈ క్రమంలో ఐక్యరాజ్యసమితిలో ఇరాన్ రాయబారి అమీర్ సయీద్ ఇరావానీ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికాతో రెండోవిడత చర్చలు జరిపేందుకు సిద్ధమేనని పేర్కొన్నారు. అయితే, హర్మూజ్‌లో తమ నౌకలపై కొనసాగుతోన్న దిగ్బంధనాన్ని ఎత్తివేయాలని షరతు విధించారు. తమ నౌకలను దిగ్బంధించడంతో.. అమెరికా కాల్పుల విరమణ ఉల్లంఘనకు పాల్పడిందని ఇరావానీ అన్నారు. దీన్ని ఎత్తివేయాలని తాము అడిగామని.. అందుకు అమెరికా కూడా సిద్ధంగా ఉన్నట్లు తమకు కొన్ని సంకేతాలు కూడా అందాయన్నారు. దిగ్బంధనం తొలగించిన వెంటనే.. ఇస్లామాబాద్‌లో చర్చలు ప్రారంభమవుతాయన్నారు. ఈ సందర్భంగా అమెరికా చర్చలు కాకుండా.. యుద్ధం చేయాలనుకుంటే అందుకు ఇరాన్ కూడా సిద్ధంగా ఉందన్నారు.

# ఈడీ విచారణలో జోక్యం..

### మమతా బెనర్జీపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ :** పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీరుపై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మనీలాండ రింగ్ వ్యవహారంలో రాజకీయ కన్సల్టెన్సీ సంస్థ 'ఐప్యాక్'పై జరుగుతున్న ఈడీ విచారణలో ముఖ్యమంత్రి, ఉన్నతాధికా రులు నేరుగా కలగజేసుకోవడం సరికాదని, ఆమె చర్యలు ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెట్టేలా ఉన్నాయని వ్యాఖ్యానిం చింది. బెంగాల్‌లో చోటుచేసుకున్న బొగ్గు కుంభకోణానికి సంబంధించిన నమోదైన మనీలాండరింగ్ కేసుపై ఈడీ గత కొన్నాళ్లుగా దర్యాప్తు చేస్తోంది. అయితే, ముఖ్యమంత్రి మమతాబెనర్జీతోపాటు ప్రభుత్వ అధికారులు దర్యాప్తులో జోక్యం చేసుకుంటున్నారంటూ ఈడీ సుప్రీం కోర్టును ఆశ్ర యించింది. దీనిపై విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయ స్థానం.. ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి ఇలా ప్రవర్తించే పరిస్థితి తలెత్తుతుందని రాజ్యాంగనిర్మాత అంబేడ్కర్ ఎప్పుడూ ఊహించి ఉండరని వ్యాఖ్యానించింది. "ఇది రాష్ట్రానికి, కేంద్రానికి మధ్య వివాదం కాదు. ఓ ముఖ్యమంత్రి నేరుగా విచారణలో జోక్యం చేసుకోవడం సమర్థనీయం కాదు. ఈ అంశాన్ని కేంద్రానికి, రాష్ట్రానికి మధ్య వివాదంగా తయారు చేయొద్దు. మీ చర్యలు ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నాయి" అని మమతాబెనర్జీని ఉద్దేశించి సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. ఈడీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఐప్యాక్ సహ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ ప్రతీక్‌జైన్ ఇంట్లో ఈడీ సోదాలు నిర్వహిస్తున్న సమయంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, తన అధికారులతో కలిసి అక్కడకు ప్రవేశించినట్లు కోర్టుకు వెల్లడించారు. 2021 నుంచి టీఎంసీ పార్టీకి ఐప్యాక్ సేవలందిస్తోన్న సంగతి తెలిసిందే.



## పహల్గాం ఘటన తర్వాత

## పాక్- హమాస్ మధ్య బలపడిన సంబంధాలు

**హమాస్ :** పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి తర్వాత హమాస్– పాక్ ఉగ్రవాదుల మధ్య సంబంధాలు బలపడినట్టు తెలుస్తోంది. పహల్గాం ఘటన కూడా హమాస్ అమలుచేసే ప్రణాళికలు, శైలిలోనే జరిగినట్టు కేంద్ర దర్యాప్తు బృందం పేర్కొంది. గతేడాది ఏప్రిల్ నుంచి పాక్ ఉగ్ర బృందాలు హమాస్‌తో ఇప్పటివరకు కనీసం నాలుగుసార్లు సమావేశమైనట్టు వెల్లడించింది. ఆ సమావేశాలు రహస్యంగా వివిధ ప్రాంతాల్లో జరిగినట్లు దర్యాప్తు బృందం గుర్తించింది. పాకిస్థాన్ ఆక్రమిత్ కశ్మీర్, పాక్ నగరాల్లో, బంగ్లాదేశ్‌లో హమాస్– పాక్ ఉగ్ర బృందాలు సమావేశమైనట్టు దర్యాప్తులో తేలింది. ఈ సమావేశాల్లో లష్కరే తయ్యిబా, జైషే మహమ్మద్ బృందాలు కూడా పాల్గొన్నట్లు సమాచారం. హమాస్–పాక్‌ల మధ్య పొత్తుల విషయంలో అవి తమ సిద్ధాంతాలను దాటి పరస్పర కార్యాచరణను అమల్లోకి తెచ్చేందుకు సిద్ధపడినట్లు తెలుస్తోంది. ఈ రెండు బృందాల ప్రణాళికలను అమలుచేయడానికి ప్రాంతీయ నెట్‌వర్క్‌ను ఉపయోగించుకుంటు న్నాయని దర్యాప్తు అధికారులు వెల్లడించారు. దీంతో దర్యాప్తు ఏజెన్సీలు నిఘా బృందాల్ని అప్రమత్తం చేశాయి. అయినా అంతర్జాతీయ ఉగ్రవాద శక్తులు, వారి ఉద్దేశాలు ఏకమవుతాయన్న అనుమానాలు భద్రతా వర్గాల్లో తీవ్ర ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి.

## ఇరాన్ నుంచి ఇరాక్‌కు భారీగా నగదు

### అడ్డుకున్న అమెరికా

**వాషింగ్టన్ :** ఇరాన్ నుంచి ఇరాక్‌కు భారీగా నగదు తీసుకెళుతున్న విమానాన్ని అమెరికా అడ్డుకున్నట్లు తెలుస్తోంది. దాదాపు 500 మిలియన్ డాలర్ల విలువైన కరెన్సీతో వెళ్తున్న విమానాన్ని అమెరికా ఎయిర్‌ఫోర్స్ అడ్డగించినట్లు అంతర్జాతీయ మీడియాలో వార్తలు వెలువడుతున్నాయి. అయితే, ఇరాన్ దీనిపై ఇప్పటి వరకు స్పందించలేదు. అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో.. ఇరాక్‌లోని ఇరాన్ మద్దతుగల మిలిటెంట్ల గ్రూప్‌లకు ఆర్థిక సాయం చేయడం ద్వారా.. అక్కడి అమెరికా స్థావరాలపై దాడులకు టెహ్రాన్ పురిగొల్పుతోందని మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ క్రమంలోనే ఇరాక్‌కు అమెరికా ఆర్థిక సాయాన్ని కూడా నిలిపివేసిందని తెలుస్తోంది. పశ్చిమాసియాలో చోటు చేసుకున్న ఉద్రిక్తతల కారణంగా ఇరాక్ గత కొంత కాలంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ప్రధానంగా ఇరాన్, అమెరికా చర్యలు ఆ దేశానికి తలనొప్పిగా మారాయి. అక్కడి ప్రభుత్వం నేరుగా ఇరాన్‌కు మద్దతు తెలపకపోయినప్పటికీ.. ఆ దేశంలోని ఇరాన్ మద్దతుదారులు అమెరికా ప్రయోజనాలను లక్ష్యంగా చేసుకోవడంపై అగ్రరాజ్యం కన్నెర్ర చేస్తోంది. ఈ క్రమంలోనే భద్రతా సహకారాన్ని కూడా నిలిపివేసిందని ఇరాక్ అధికార వర్గాలు చెబుతున్నాయి.



## లైంగిక దాడి చేసి.. కేబుల్‌తో హత్యచేసి..

### ఢిల్లీలో ఐఆర్ఎస్ కుమార్తె హత్య..

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని దిల్లీలో ఐఆర్ఎస్ అధికారి కుమార్తె హత్యకు గురయ్యారు. అమర్ కాలనీలోని నివాసంలో బుధవారం ఉదయం ఈ ఘటన జరిగింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈరోజు ఉదయం ఐఆర్ఎస్ అధికారి, ఆయన భార్య జిమ్‌కు వెళ్లారు. అప్పుడు వారి కుమార్తె ఒక్కరే ఇంట్లో ఉన్నారు. వారు ఇంటికి తిరిగి వచ్చి చూసేసరికి ఆమె అనుమానాస్పద స్థితిలో ప్రాణాలు కోల్పోయి కనిపించింది. దీనిపై సమాచారం అందడంతో.. పోలీసులు, ఫోరెన్సిక్ బృందాలు ఘటనాస్థలాన్ని పరిశీలించాయి. గతంలో ఆ ఇంట్లో పనిచేసిన యువకుడే ఈ ఘాతుకానికి పాల్పడి ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ఆరు వారాల క్రితమే అతడిని పనిలో నుంచి తొలగించారు. ఘటనకు కొన్ని గంటల ముందు అతడు ఇంటి పరిసరాల్లో తిరిగినట్లు సీసీటీవీ దృశ్యాల ఆధారంగా గుర్తించారు. సమయం కోసం వేచి చూసిన నిందితుడు.. ఆమె ఒంటరిగా ఉండటాన్ని గమనించి, ఇంట్లోకి చొరబడి ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. లైంగిక దాడి చేసి, మొబైల్ ఫోన్ ఛార్జింగ్ కేబుల్‌తో గొంతు నులిమి చంపేసినట్టుగా ఉన్న గుర్తులను స్వాధీనం చేస్తున్నారు. అయితే ఈ కేసుకు సంబంధించి అధికారిక ధ్రువీకరణ రావాల్సి ఉంది. ప్రస్తుతం నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. మృతురాలి తండ్రి ఆదాయపన్ను విభాగంలో సీనియర్ అధికారి. ఆ యువతి ఇంజినీరింగ్ పూర్తి చేసి, యూపీఎస్సీ పరీక్షలకు సిద్ధమవుతోంది.

## మత్తు మందు ఇచ్చి.. హోమ్‌స్టేలో అమెరికా మహిళపై అత్యాచారం

**కర్ణాటక :** కర్ణాటకలోని హోమ్‌స్టేలో తనపై అత్యాచారం జరిగిందంటూ ఓ అమెరికా మహిళ ఆరోపించింది. ఈ ఘటన కొడగులో చోటుచేసుకుంది. ఈక్రమంలో హోమ్‌స్టే యజమానిని, అక్కడ పని చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. జార్ఖండ్‌కి చెందిన వృజేష్‌కుమార్ కొడగు జిల్లాలోని కుట్టా గ్రామంలో ఓ హోమ్‌స్టేలో పని చేస్తున్నాడు. అతడు అమెరికాకు చెందిన మహిళపై(ఖూ ఔశీఝఅ) అత్యాచారం చేశాడని పోలీసులకు ఫిర్యాదు అందింది. అయితే ఈ ఘటన బయటకు తెలియకుండా ఉండేందుకు ఆ హోమ్‌స్టే యజమాని ప్రయత్నించాడు. ఈ క్రమంలోనే వారిద్దరినీ పోలీసులు అరెస్టు చేశారు. బాధితురాలు ఈ విషయం ఎవరికీ చెప్పకుండా ఉండేలా అక్కడున్న వైఫైని మూడు రోజుల పాటు ఆఫ్ చేశాడు. అదే సమయంలో ఆమెకి మత్తుమందు ఇచ్చి, ఎవరినీ కలవనివ్వకుండా చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఆ తర్వాత ఆమె మైసూరు వెళ్తానని చెప్పి అక్కడి నుంచి తప్పించుకుందని పోలీసులు వెల్లడించారు. హోమ్‌స్టే నుంచి తప్పించుకొన్న ఆ మహిళ ఈ ఘటన గురించి అమెరికా ఎంబసీకి సమాచారం ఇచ్చింది. ఎంబసీ అధికారులు మైసూరు పోలీసులకు దీనిపై మెయిల్ చేశారు. దీంతో కుట్టా పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేశారు. వచ్చే నెల 3 వరకు వీరిద్దరికీ జ్యుడీషియల్ కస్టడీ విధించారు. దీనిపై ఇంకా దర్యాప్తు కొనసాగుతున్నట్టు అధికారులు పేర్కొన్నారు.

# సోనీ స్పోర్ట్స్‌లో ఆసియా క్రీడల క్రికెట్

20వ ఆసియా క్రీడలు ఐచి-నగోయా 2026 ప్రసార హక్కులను సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియా దక్కించుకుంది. 2026 సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జపాన్‌లో జరగనున్న 20వ ఆసియా క్రీడలు ఐచి-నగోయా 2026, సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ఛానళ్లలో ప్రత్యక్ష ప్రసారమవుతాయి. అలాగే సోనీలో స్ట్రీమ్ అవుతాయి. గత ఆసియా క్రీడలలో భారత్ 107 పతకాలను సాధించి, టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రదర్శనను కనబరిచింది. దీంతో ఈ టోర్నమెంట్‌పై అంచనాలు రెట్టింపు అయ్యాయి. క్రికెట్, టెన్నిస్, ఈ-స్పోర్ట్స్, కబడ్డీ, సెపక్ తక్రా, కురాష్ వంటి ప్రధాన క్రీడలతో పాటు, 32 ఒలింపిక్ క్రీడలు కలిపి మొత్తంగా 41 క్రీడల్లో అగ్రశ్రేణి క్రీడాకారులు పాల్గొంటారు. ఈ ఎడిషన్‌లో క్రికెట్ ప్రధానంగా హైలైట్ కానుంది. దేశవ్యాప్తంగా లక్షల మందికి స్ఫూర్తినిచ్చే క్రీడా సమరాన్ని సమగ్రంగా అందించడానికి సిద్ధంగా ఉన్నామని స్పోర్ట్స్ అండ్ ఇంటర్నేషనల్, సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియా చీఫ్ రెవెన్యూ ఆఫీసర్ బిజినెస్ హెడ్ రాజేష్ కౌల్, డైరెక్టర్ జనరల్-ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఆసియా హుసేన్ అల్-ముసల్లం ఒక ప్రకటనలో తెలిపారు.






## మూడు రోజుల వరుస లాభాలకు బ్రేక్

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్ట్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. ఇరాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ప్రకటించినప్పటికీ.. శాంతి చర్చల అంశం ఇంకా కొలిక్కి రాకపోవడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీనికితోడు గరిష్ఠ స్థాయిలో క్రూడాయిల్ ధరలు కొనసాగుతుండడం, ఇటీవల లాభాల నేపథ్యంలో మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం వంటివి ప్రభావం చూపాయి. ముఖ్యంగా ఐటీ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి సూచీలను పడేశాయి. దీంతో సెన్సెక్స్ 750 పాయింట్లకు పైగా నష్టపోగా.. నిఫ్టీ 24,400 దిగువకు చేరింది. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి ప్రతికూల సంకేతాలతో సెన్సెక్స్ ఉదయం 79,019.34 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 79,273.33) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల బాటలోనే పయనించింది. ఇంట్రాడేలో 78,442.30 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 756.84 పాయింట్ల నష్టంతో 78,516.49 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 198.50 పాయింట్ల నష్టంతో 24,378.10 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 37 పైసలు క్షీణించి 93.81గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 10 శాతం మేర నష్టపోయింది. ఇన్ఫోసిస్, మహీంద్రా అండ్ మహీంద్రా, టీసీఎస్, టెక్ మహీంద్రా స్టాక్స్ కూడా నష్టాలు చవిచూశాయి. హిందుస్థాన్ యూనిలీవర్, ఎన్టీపీసీ, ఎటర్నల్, ట్రెంట్, అల్ట్రాటెక్ సిమెంట్ లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 99 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం 4754 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

**ఐటీ స్టాక్స్ ధమాల్:** ఐటీ స్టాక్స్‌లో అమ్మకాలతో నేడు నిఫ్టీ ఐటీ ఇండెక్స్ దాదాపు 4 శాతం మేర నష్టపోయింది. నిన్న నిరుత్సాహకర క్యూ4 ఫలితాలతో పాటు బలహీన భవిష్యత్ అంచనాలను హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ వెలువరించడం ఇందుకు కారణమైంది. దీంతో హెచ్‌సీఎల్ స్టాక్ దాదాపు 11 శాతం మేర పతనం కాగా.. ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, టీసీఎస్ స్టాక్స్ కూడా నష్టాలు చవిచూశాయి. దీంతో సూచీలపై ఒత్తిడి పడింది.



## సోదరుడితో విభేదాలపై కృనాల్ రియాక్షన్

ఐపీఎల్‌లో పాండ్య బ్రదర్స్ (కృనాల్- హార్దిక్) సందడి అంతా ఇంతా కాదు. ఈ సోదరులు ఇద్దరు తమ ప్రదర్శనతో ఈ లీగ్‌లో ఉత్తమ ప్లేయర్లుగా ఎదిగారు. కెరీర్ తొలినాళ్లలో ఈ ఇద్దరూ ముంబయి ఇండియన్స్‌కే ప్రాతినిధ్యం వహించారు. ఆ తర్వాత ఒక్కరు ఒక్కో టీమ్‌కు ఆడుతున్నారు. అయితే ప్రత్యర్థులుగా బరిలోకి దిగినప్పటికీ పాండ్య బ్రదర్స్ స్పోర్ట్స్ స్పిరిట్ మెచ్చుకునేలా ఉంటుంది. మైదానం బయట కూడా వీళ్లిద్దరూ ఇంకా ప్రేమగా ఉండేవారు. అయితే ఈ ఇద్దరి మధ్య విభేదాలు వచ్చినట్లు ఇటీవల ప్రచారం సాగుతోంది. మరోవైపు, కొంతకాలంగా ఈ ఇద్దరూ మునుపటిలా క్లోజ్‌గా కూడా ఉండడం లేదు. కొన్ని నెలలుగా ఒకే ఫ్రేమ్‌లో పాండ్య బ్రదర్స్ అసలు కనిపించింది లేదు. కనీసం సోషల్ మీడియాలోనైనా ఒకరినొకరు పలకరించుకున్నదీ లేదు. అయితే రీసెంట్‌గా ముంబయి ఇండియన్స్- రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య మ్యాచ్ జరిగింది. ఇందులో కృనాల్ ఆర్సీబీకి, హార్దిక్ ముంబయికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దీంతో ఈ ఇద్దరు ఎదురుపడ్డప్పుడు మాట్లాడుకుంటారేమో అని అభిమానులు ఎదురుచూశారు. కెమెరాలు కూడా వీళ్లిద్దర్నీ ఫోకస్ చేశాయి. కానీ మ్యాచ్ సందర్భంగా ఎదురుపడినప్పటికీ పాండ్య బ్రదర్ ఒకరితో ఒకరు మాట్లాడుకోలేదు. దీంతో అన్నదమ్ముళ్ల మధ్య విభేదాలు నిజమేనని అంతా అనుకుంటున్నారు! అయితే తమ సోదరుల మధ్య అంతా సవ్యంగా లేదన్న వార్తలపై కృనాల్ స్పష్టతనిచ్చాడు. తాజాగా అతడు ఆర్సీబీ ఇన్?సైడర్స్ మిస్టర్ నాగ్స్ ఇంటర్వ్యూలో పాల్గొన్నాడు. ఇందులో 'గతేడాది నువ్వు నా షోకు రాలేదు. అప్పుడు నేను ఫోన్ చేస్తే నువ్వు ఫ్యామిలీలో బిజీగా ఉన్నానని చెప్పావు. అంటే ఆర్సీబీ నీ ఫ్యామిలీ కాదా?' అని అడిగాడు. దీనికి కృనాల్ 'ఆర్సీబీ కూడా నా ఫ్యామిలీనే. నేను చెప్పాను కానీ నువ్వు సరిగ్గా విననట్లు ఉన్నావు. అయితే ఇంట్లో అనేకమంది ఫ్యామిలీ మెంబర్స్ ఉంటారు. కానీ ఒక్కోసారి ఒకరిని మిస్ అవుతాము' అని అన్నాడు. దీనికి నాగ్స్ వెంటనే 'మీ సోదరుడి లాగానే' అని అన్నాడు. దీనికి కృనాల్ నవ్వేశాడు. ఈ క్రమంలోనే తమ బ్రదర్స్ మధ్య అంతా సవ్యంగానే ఉందా? అని కృనాల్?ను నాగ్స్ అడిగాడు. "మీ ఇద్దరి మధ్య అంతా బాగానే ఉందా? లేదా ఏమైనా గొడవలు జరుగుతున్నాయా?" అని అడగ్గా, కృనాల్ ఒక్కసారిగా నవ్వేశాడు. అప్పుడు హోస్ట్ "కేన్, అండర్‌టేకర్ కూడా కొన్నిసార్లు గొడవ పడతారు అది కామనే" (రెజ్లర్లను ఉద్దేశించి) అని వ్యాఖ్యానించాడు. దీనికి "అంతా బాగానే ఉంది" అని కృనాల్ నవ్వుతూ బదులిచ్చాడు. దీంతో అన్మదమ్ముళ్ల మధ్య గొడవలు అన్న ప్రచారానికి ఫుల్? స్టాప్ పడినట్లే అని ఫ్యాన్స్ భావిస్తున్నారు.

## ధోనీ రాకతో సీఎస్‌కే దశ మారుతుందా?



ఐపీఎల్ 2026 సీజన్ మొదలైె అప్పుడే చెన్నై సూపర్ కింగ్స్ 6 మ్యాచ్‌లు ఆడేసింది. కానీ కోట్లాది మంది అభిమానులు ఎదురుచూస్తున్న ఆ ఒక్క రూపం మాత్రం ఇంకా మైదానంలో కనిపించలేదు. తనే.. మన తలా ఎంఎస్ ధోనీ. అయితే, ముంబై ఇండియన్స్‌తో జరగబోయే కీలక పోరుకు ముందు ధోనీ ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్ ఒకటి బయటకు వచ్చింది. ధోనీ రీఎంట్రీ పై క్లారిటీ వచ్చేసింది. సాధారణంగా అయితే ఎంఎస్ ధోనీ నెట్స్‌లో వికెట్ కీపింగ్ ప్రాక్టీస్ చేయడం చాలా అరుదు. ఆయన ఎక్కువగా బ్యాటింగ్ లేదా సరదాగా బౌలింగ్ చేస్తూ కనిపిస్తారు. కానీ, ముంబై ఇండియన్స్‌తో మ్యాచ్‌కు ముందు ధోనీ వికెట్ కీపింగ్ గ్లోవ్స్ ధరించి ప్రాక్టీస్ చేయడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ముంబై మాజీ ప్లేయర్ ఆదిత్య తారే దీని మీద స్పందిస్తూ.. "నేను ధోనీని నెట్స్‌లో కీపింగ్ చేయడం ఎప్పుడూ చూడలేదు. ఇది నిజంగా షాకింగ్. బహుశా ఆయన తన మ్యాచ్ ఫిట్‌నెస్‌ను పరీక్షించుకుంటున్నట్లు ఉన్నారు." అని పేర్కొన్నారు. ఇది సీఎస్‌కే శిబిరంలో గుడ్ సిగ్నల్స్ పంపుతోంది. ఐపీఎల్ 2026 ప్రారంభానికి ముందే ధోనీ కాఫ్ ఇంజూరీ (పిక్క గాయం) బారిన పడ్డారు. దీనివల్ల సీజన్ లో మొదటి 6 మ్యాచ్‌లకు ఆయన దూరమయ్యారు. ధోనీ లేకపోవడం వల్ల చెన్నై జట్టు 6 మ్యాచ్‌లలో కేవలం రెండింటిలో మాత్రమే గెలిచి, నాలుగింటిలో ఓడిపోయింది. జట్టులో గేమ్ అవేర్‌నెస్ లోపించిందని, క్లిష్ట సమయాల్లో ధోనీ వంటి సీనియర్ అవసరం ఎంతైనా ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పుడు ఆయన ప్రాక్టీస్ మొదలుపెట్టడంతో, ఏప్రిల్ 23న ముంబైతో జరిగే మ్యాచ్‌లో ఆయన బరిలోకి దిగడం ఖాయమనిపిస్తోంది. గడిచిన రెండు సీజన్లలో ధోనీ లోయర్ ఆర్డర్ (నంబర్ 7 లేదా 8)లో వచ్చి మెరుపులు మెరిపించారు. 2024 ఐపీఎల్‌లో 161 పరుగులు చేసిన ఆయన, 2025 సీజన్‌లో 14 మ్యాచ్‌లలో 196 పరుగులు సాధించారు.



# లఖ్‌నవూపై రాజస్థాన్ రాయల్స్ ఘన విజయం

**లఖ్‌నవూ:** ఐపీఎల్ 2026లో భాగంగా లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ 40 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. అనంతరం 160 పరుగుల లక్ష్యఛేదనతో బరిలోకి దిగిన లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ 18 ఓవర్లలో 119 పరుగులకే ఆలౌటైంది. లఖ్‌నవూ బ్యాటర్లలో మిచెల్ మార్ష్ (55; 41 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) మాత్రమే రాణించాడు. నికోలస్ పూరన్ (22) ఫర్వాలేదనిపించాడు. వీరిద్దరి తర్వాత హిమ్మత్ సింగ్ (15) మాత్రమే రెండంకెల స్కోర్ చేయగలిగాడు. మిగతా బ్యాటర్లంతా విఫలమయ్యారు. టాప్ ఆర్డర్‌లో... ఆయుష్ బదోని, రిషభ్ పంత్, ఐడెన్ మార్‌క్రమ్ డకౌట్లుగా వెనుదిరిగారు. రాజస్థాన్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్ 3, నాండ్రే బర్గర్, బ్రిజేశ్ శర్మ తలో రెండు, రవీంద్ర జడేజా, రవి బిష్ణోయ్ చెరో వికెట్ తీసుకున్నారు. అంతకుముందు రాజస్థాన్ రాయల్స్ బ్యాటర్లలో రవీంద్ర జడేజా (43; 29 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. యశస్వి జైస్వాల్ (22), హెట్‌మయిర్ (22), రియాన్ పరాగ్ (20), ఫెరీరా (20) ఫర్వాలేదనిపించారు. శుభమ్ దూబె (19) నాటౌట్‌గా నిలిచాడు. వైభవ్ సూర్యవంశీ (8), ధ్రువ్ జురేల్ (0) బ్యాటింగ్‌లో విఫలమయ్యారు. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ బౌలర్లలో మహ్మద్ షమీ, ప్రిన్స్ యాదవ్, మోహ్సిన్ ఖాన్ చెరో రెండు వికెట్లు తీశారు.

## యువ పేసర్‌కు హగ్ ఇచ్చిన కావ్య మారన్?



సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓనర్ కావ్య మారన్, ఆ జట్టు యువ పేసర్ ప్రఫుల్ హింగేకు సంబంధించిన ఓ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ప్రఫుల్ హింగేను కావ్య మారన్ హగ్ చేసుకున్నట్లుగా ఉన్న ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా తీవ్ర చర్చనీయాంశమైంది. అరంగేట్ర మ్యాచ్‌లోనే ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే ప్రఫుల్ హింగే మూడు వికెట్లు తీసి ఈ ఫీట్ సాధించిన తొలి బౌలర్‌గా చరిత్ర సృష్టించాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా రాజస్థాన్ రాయల్స్‌తో ఉప్పల్ వేదికగా జరిగిన మ్యాచ్‌తో ఐపీఎల్ కెరీర్ ప్రారంభించిన ప్రఫుల్ హింగే.. 4 వికెట్లతో మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన కనబర్చాడు. చెన్నై సూపర్ కింగ్స్‌తో తన రెండో మ్యాచ్‌లో వికెట్ తీయకపోయినా.. ఆఖరి ఓవర్‌లో కట్టడిగా బౌలింగ్ చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. టీమ్ కాంబినేషన్‌లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో గత మ్యాచ్‌కు ప్రఫుల్ హింగే బెంచ్‌కే పరిమితమయ్యాడు. అయితే ఈ యువ పేసర్ ప్రదర్శనకు ఫిదా అయిన కావ్య మారన్.. ఈ కుర్రాడిని హగ్ చేసుకున్నట్లు కొందరు ఆకతాయిలు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో ఫేక్ వీడియోను సృష్టించారు. ఈ వీడియోలో ప్రఫుల్ హింగేతో పాటు మరో యువ పేసర్ సాకిబ్ హుస్సేన్‌ను కావ్య మారన్ ప్రత్యేకంగా అభినందించినట్లు ఉంది. అయితే ఈ వీడియోను చూస్తేనే ఇది ఏఐతో తయారు చేసిందనే విషయం స్పష్టంగా అర్థమవుతుంది. అయితే ఇది తెలియని కొందరు అభిమానులు నిజమేనని భావించి.. వైరల్ చేస్తున్నారు. 'కుర్రాళ్ల ప్రతిభకు ఫిదా అయిన కావ్య మారన్ వారిని హగ్ చేసుకొని ప్రశంసించింది. ఆమె హగ్‌తో కుర్రాళ్లు సంతోషానికి గురయ్యారు.'అనే క్యాప్షన్స్ రాసుకొస్తున్నారు. అయితే ఈ వీడియోలో ఎలాంటి నిజం లేదు. కావ్య మారన్ ఎప్పుడూ మైదానంలోకి రారు. ఆటగాళ్లతో కూడా చాలా తక్కువగా మాట్లాడుతారు. ఐపీఎల్ 2024 ఫైనల్ ఓటమి అనంతరం సన్‌రైజర్స్ హైదరాబాద్ డ్రెస్సింగ్ రూమ్‌లోకి కావ్య మారన్ తొలిసారి వచ్చారు. ఓటమి బాధలో ఉన్న ఆటగాళ్లను ఓదార్చారు. అంతే తప్పా ఎప్పుడూ ఆమె మైదానంలో అడుగుపెట్టలేదు. గ్యాలరీలోనే సందడి చేసి అక్కడి నుంచే వెళ్లిపోతారు. కావ్యమారన్‌పై డీప్ ఫేక్ వీడియోలు సృష్టించడం ఇదే తొలిసారి కాదు. గతంలో జై షా, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్‌లతో సన్నిహితంగా ఉన్నట్లు ఫేక్ వీడియోలను సృష్టించి వైరల్ చేశారు.

## అభిషేక్ చిరస్మరణీయ ఇన్నింగ్స్



ఐపీఎల్ 2026లో భాగంగా నిన్న ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాడు అభిషేక్ శర్మ అదరగొట్టాడు. ఢిల్లీ బౌలర్లను ఊచకోత కోస్తూ చిరస్మరణీయ ఇన్నింగ్స్‌ను ఆడాడు. 47 బంతుల్లోనే సెంచరీని పూర్తి చేసుకున్నాడు. మొత్తంగా 68 బంతుల్లో 135 పరుగులతో అజేయంగా నిలిచాడు. అతడి ఇన్నింగ్స్‌లో 10 ఫోర్లు, 10 సిక్సర్లు ఉన్నాయి. ఈ క్రమంలోనే పలు రికార్డులను అందుకున్నాడు. 50 బంతుల్లోపు రెండు ఐపీఎల్ సెంచరీలను సాధించిన తొలి భారత క్రికెటర్‌గా అభిషేక్ శర్మ రికార్డు సృష్టించాడు. అభిషేక్ 2025 ఐపీఎల్‌లో పంజాబ్‌పై 40 బంతుల్లోనే శతకాన్ని సాధించాడు. టీ20 క్రికెట్‌లో అత్యధిక సెంచరీలు చేసిన భారతీయ ప్లేయర్‌గా విరాట్ కోహ్లీతో కలిసి సంయుక్తంగా నిలిచాడు. ఈ క్రమంలో అతడు రోహిత్ శర్మను అధిగమించాడు. టీ20ల్లో ఇప్పటి వరకు అభిషేక్ శర్మ 9 సెంచరీలు చేశాడు. ఇందులో ఐపీఎల్‌లో రెండు, టీమిండియా తరుపున రెండు సెంచరీలు ఉండగా.. మిగిలినవి దేశవాళీ టీ20 క్రికెట్‌లో చేశాడు. ఇక టీ20 క్రికెట్‌లో అత్యధిక సెంచరీలు చేసిన ఆటగాళ్ల జాబితాలో అభిషేక్ శర్మ చోటు సంపాదించుకున్నాడు.



## గృహ విక్రయాలపై ఐటీ రంగం ఎఫెక్ట్..

కృత్రిమ మేధ అన్ని రంగాలకు వేగంగా విస్తరిస్తుండటంతో అంతర్జాతీయంగా పలు కంపెనీలు లేఆఫ్‌లు ప్రకటిస్తున్నాయి. ముఖ్యంగా ఐటీ రంగానికి చెందిన వారిపై ఈ ఎఫెక్ట్ ఎక్కువగా ఉంటోంది. ఇంకోపక్క ఐటీ నియామకాల్లో మందగమనమూ కొనసాగుతోంది. ఇవన్నీ భారత్‌లో గృహ విక్రయాలపై ప్రభావం చూపిస్తున్నాయి. దాంతో ఇళ్లు కొనుగోలు చేసేవారు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఐటీ హబ్‌లుగా పేరున్న హైదరాబాద్, బెంగళూరు, పుణెలో ఈ ప్రభావం ఉందని నైట్ ఫ్రాంక్ ఇండియా తాజాగా గణాంకాలను వెల్లడించింది. 2026 మొదటి త్రైమాసికంలో ప్రధాన ఎనిమిది నగరాల్లో అమ్మకాలు నాలుగు శాతం తగ్గాయి. కొత్తగా నిర్మాణం పూర్తయిన ఇళ్ల అమ్మకాలు రెండు శాతం తగ్గి, 94,855కి చేరాయి. కొవిడ్ మహమ్మారి తర్వాత పుంజుకున్న ఈ రంగం మళ్లీ ఇప్పుడు మందగమనాన్ని చూస్తోందని ఈ గణాంకాలను బట్టి తెలుస్తోంది. నేషనల్ క్యాపిటల్ రీజియన్, పుణెలో మార్కెట్ మరీ బలహీనంగా ఉంది. ఐటీ ఉద్యోగాల్లో కోతలు, నియామకాల్లో అనిశ్చితి, ఆ ఆర్థిక భారాన్ని భరించగలమో లేదోనన్న ఆందోళన, అంతర్జాతీయ పరిణామాలు కొనుగోలుదారుల సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నాయి. ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాలను ఈ అంశాలు ప్రధానంగా ప్రభావితం చేస్తున్నాయని నైట్ ఫ్రాంక్ ఇండియా లెక్కలు వెల్లడిస్తున్నాయి. వరుసగా ఐదేళ్ల వృద్ధి తర్వాత ఇలాంటి అనూహ్య పరిణామాలు అనివార్యమేనని ఆ సంస్థ నేషనల్ డైరెక్టర్ అంకితా సూద్ పేర్కొన్నారు. పరిమాణం పరంగా చూసుకుంటే తక్కువే అయినా.. విలువ పరంగా పెరుగుదల ఉందని పరిశ్రమ వర్గాలు వెల్లడించాయి. లావాదేవీల విలువ ప్రతి ఏడాది ఐదు నుంచి ఆరు శాతం పెరుగుతోందని గుర్తుచేశాయి.




## నెస్లే ఇండియా లాభం రూ.1,110 కోట్లు

ఎఫ్ఎంసీజీ దిగ్గజం నెస్లే ఇండియా, గత ఆర్థిక సంవత్సరం జనవరి-మార్చిలో రూ.1,110.9 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.873.46 కోట్లతో పోలిస్తే ఇది 27.18% అధికం. ఉత్పత్తుల విక్రయాల ఆదాయం 23.42% పెరిగి రూ.6,723.75 కోట్లకు చేరింది. కార్యకలాపాల ఆదాయం 5,503.88 కోట్ల నుంచి రూ.6,747.79 కోట్లకు పెరిగింది. మొత్తం వ్యయాలు 21% పెరిగి రూ.5,217.48 కోట్లకు చేరాయి. మొత్తం ఆదాయం (ఇతర ఆదాయంతో కలిపి) 22.73% పెరిగి రూ.6,766.24 కోట్లకు చేరింది. దేశీయ విక్రయాలు 23.11% పెరిగి రూ.6,445.07 కోట్లకు చేరాయి. 'అత్యధికంగా దేశీయ విక్రయాలు నమోదు కావడంతో రెండంకెల వృద్ధి నమోదైంది. పరిమాణ పరంగానూ రెండంకెల వృద్ధి సాధించాం. ప్రకటన వ్యయాలు 50 శాతానికి పైగా పెరిగాయి. ఆరోగ్యకర ఎబిటా మార్జిన్ (26.3%) నమోదైంద'ని నెస్లే ఇండియా ఎండీ మనీశ్ తివారీ వెల్లడించారు. ఎగుమతుల ఆదాయం 31% పెరిగి 278.68 కోట్లకు చేరింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి నెస్లే ఇండియా నికర లాభం 9% పెరిగి రూ.3,499.08 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం 14.46% పెరిగి రూ.23,194.95 కోట్లకు చేరింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.1 ముఖ విలువ కలిగిన ఒక్కో ఈక్విటీ షేరుకు 500% (రూ.5) తుది డివిడెండ్ చెల్లించేందుకు బోర్డు ఆమోదం తెలిపింది.

Printed, published and owned by **VELLENKI JAYAPAL REDDY**, printed at **M/s KAKATIYA PRINTERS**, H-No: 24-91/72/1, Block No. 29, Plot Nos 72, 73 and 74, Lakshminarayana Nagar IDA Uppal, Uppal Mandal, Medchal-Malkajgiri Dist, Telangana-39, Published at H-No: 3-125/92/86, Anaghapuri Colony, Boduppal, Medipally Mandal, Medchal-Malkajgiri Dist, Telangana- 92, Editor: **VELLENKI JAYAPAL REDDY**, Cell No: **9346984911, 9133445456**, RNI NO: TELTEL/2023/84471, website: www.nedudailynews.com, e-mail: vellenkijayapalreddy@gmail.com